# తొలి అక్షరం

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 02 సంచిక - 194 పేజీలు - 08 శనివారం 07 జూన్ 2025


## ఢిల్లీ సిఎం రేఖా గుప్తాకు బెదిరింపులు

**తొలి అక్షరం/న్యూఢిల్లీ, జూన్ 06:** దేశరాజధాని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాను చంపేస్తామంటూ బెదిరింపులు వచ్చాయి. ఘజియాబాద్‌లోని పోలీస్ కంట్రోల్ రూమ్ కు అర్థరాత్రి దుండగుడు ఫోన్ చేసి.. సిఎంను హత్య చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో అప్రమత్తమైన అధికారులు ఢిల్లీ సిఎంకు భద్రత కట్టుదిట్టం చేశారు. ఘజియాబాద్ డిప్యూటీ- కమిషనర్ ఆఫ్ పోలీస్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి 11:00 గంటల ప్రాంతంలో బెదిరింపు కాల్ వచ్చింది. బెదిరింపు కాల్ చేసిన వ్యక్తి.. తర్వాత ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేశాడు. బెదిరింపులకు పాల్పడిన దుండగుడి పట్టు-కునేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అనుమానితుడిని గుర్తించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

## బిఆర్ఎస్ కాదు..
# అది డిఆర్ఎస్




- అదో దెయ్యాల రాజ్యసమితి
- కవిత వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం
- ఫామ్ హౌజ్‌లో నిద్రపోతున్న దెయ్యాల నేత
- మూసీ ప్రక్షాళన చేస్తామంటే ఎందుకు అడ్డుకుంటారు
- తిరుమలలాగా యాదగిరి గుట్ట అభివృద్ధి
- యాదగిరి గుట్టలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం
- యాదగిరిగుట్ట పర్యటనలో సిఎం రేవంత్ విమర్శలు

**తొలి అక్షరం/భువనగిరి,జూన్6:** పదేళ్లలో ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేకపోయిన ఘనత బిఆర్ఎస్‌దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట వద్ద అపచారానికి మూల్యం చెల్లించుకున్నారు. పాపాలు చేసినందునే మీ పరిస్థితి ఆ విధంగా మారింది. తమ పార్టీలో దెయ్యాలు చేరాయని ఆ పార్టీ నాయకురాలే చెప్పారు. జవాబివ్వలేక దెయ్యాల నేత ఫాంహౌస్‌లో నిద్రపోతున్నారు. బీఆర్ఎస్ కాదు.. డీఆర్ఎస్.. దెయ్యాల రాజ్యసమితి. కొరివి దెయ్యాలను



తరిమికొట్టే బాధ్యత నేను తీసుకుంటా. అందుకు కార్యకర్తల సహకారం కావాలని రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో రూ.1500 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. బంగారు తెలంగాణ ముసుగులో పదేళ్లు దోచుకున్న వాళ్లా నన్ను ప్రశ్నించేది. మిగతావి 2లో

## కాళేశ్వరం రిపోర్ట్ త్వరగా
# బయట పెట్టాలి

- తాత్సారం చేస్తే వదిలే ప్రసక్తి లేదు
- కంఠంపై తుపాకి పెట్టినా నిజాలే చెబుతా
- తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టుకు మహారాష్ట్ర ఒప్పుకోలే
- కేబినేట్ ఆమోదం తరవాత త్రీమెన్ కమిటీ వేశారు
- కాళేశ్వరం నిర్ణయం మొత్తం కెసిఆర్‌దే
- జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణలో ఈటెల వెల్లడి



**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 6:** కాళేశ్వరం రిపోర్ట్ త్వరగా బయట పెట్టాలని.. రిపోర్ట్ విషయంలో తాత్సారం చేస్తే వదిలే ప్రసక్తి లేదని బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. కాళేశ్వరం విచారణ అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. కంఠంపై తుపాకీ పెట్టినా ఈటెల నిజమే మాట్లాడుతారని స్పష్టం చేశారు. ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు డిజైన్లు, నిర్మాణంతో సంబంధం ఉందా అని కమిషన్ అడిగిందని.. తనకేం సంబంధం లేదని చెప్పానన్నారు. కాళేశ్వరం కార్పొరేషన్‌పై అధికారం ఉండేదా అని అడగ్గా.. తనకు ఎలాంటి అధికారం లేదని చెప్పినట్లు తెలిపారు. కాళేశ్వరం నిర్మాణం క్వాలిటీ- గురించి ఇంజనీర్లు చూసుకోవాలని.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హరీష్ నాయకత్వంలో కేబినెట్ సబ్ కమిటీ వేశారన్నారు. మంత్రివర్గ ఉపసంఘం, సీడబ్ల్యూసీ రిపోర్ట్ ఆర్థిక శాఖ ముందు మిగతావి 2లో

## రూ.25వేల కోట్ల అవినీతి
# ఆరోపణల కేసు

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు సుప్రీం నోటీసులు



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జూన్ 6:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ చేసిన రూ.25వేల కోట్ల అవినీతి ఆరోపణల కేసులో సుప్రీం నోటీసులిచ్చింది. కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంలో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సతీశ్ చంద్రశర్మతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను విచారించింది. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందంటూ కేటీఆర్ గతంలో ఆరోపణలు చేశారు. దీంతో కేటీఆర్ చేసిన ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ.. ఉట్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిగతావి 2లో

## చినాబ్ వంతెన కశ్మీర్ పురోగతికి
# ప్రతిబింబం

- కశ్మీర్‌లో అభివృద్ధిని ఎవ్వరూ ఆపలేరు
- ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులకు బుద్ధి చెప్పాం
- పర్యాటకాన్ని దెబ్బతీసి..పేదల పొట్టకొట్టాలని పాక్ పన్నాగం
- రైలు వంతెన ప్రారంభించిన అనంతరం ప్రధాని మోడీ వెల్లడి
- బ్రిటిషర్లు కూడా చేయలేని పనిని మోడీ చేసి చూపారన్న ఒమర్



**తొలి అక్షరం/శ్రీనగర్, జూన్ 06:** చినాబ్ వంతెన ప్రారం భోత్సవం జమ్మూకశ్మీర్ పురోగతికి ప్రతిబింబమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా.. కశ్మీర్‌లో అభివృద్ధిని ఆపలేరన్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత తొలిసారి కశ్మీర్ లోయలో పర్యటించిన ప్రధాని.. ప్రపంచంలోనే ఎత్తైన బ్రిడ్జిగా నిలిచిన చినాబ్ వంతెనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు- చేసిన కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ.. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావించారు. ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పామని పునరుద్ఘాటించారు. మన పొరుగు దేశం పర్యాటకానికి, మానవత్వానికి వ్యతిరేకం. మన పర్యాటకాన్ని దెబ్బతీసి పేదల పొట్టగొట్టాలని చూస్తోంది. ఆదిల్ హుస్సేన్ గుర్రం మీద పర్యాటకులను తీసుకెళ్లే పోనీవాలా. తన కుటుంబాన్ని పోషించేందుకు కష్టపడే అతడు.. ఆ రోజు ఉగ్రవాదులతో వీరోచితంగా పోరాడాడు. అతడినీ ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో వెనక్కి మిగతావి 2లో



## బనకచర్లతో తెలంగాణకు
# అన్యాయం

- ఆమోదయోగ్యం కాదంటూకేంద్రానికి లేఖలు
- తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 6:** బనకచర్లతో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అంతర్రాష్ట్ర జలవిధానాలకు, జీఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధంగా బనకచర్ల ప్రాజెక్టు ఉందని ఆక్షేపించారు. ఈ ప్రాజెక్టను తెలంగాణ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని మరోమారు స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టుపై అభ్యంతరం తెలుపుతూ కేంద్రమంత్రులు సీఆర్‌పాటిల్, నిర్మలా సీతారామన్‌కు లేఖలు రాశామని చెప్పారు.ఏపీ నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని.. వస్తే అన్ని నిబంధనలు పరిశీలిస్తామని పాటిల్ చెప్పారు. మిగతావి 2లో


## కాళేశ్వరంపై ఈటెల
# డొంకతిరుగుడు

- అవినీతి జరగలేదన్నట్లుగా వ్యాఖ్యలు
- కెసిఆర్‌తో కుమ్మక్కయినట్లు స్పష్టం
- మండిపడ్డ పిసిసి చీఫ్ హేష్ కుమార్ గౌడ్




**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 6:** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కేసీఆర్ తప్పేమీ లేదన్నట్లుగా, అంతా కేబినెట్ నిర్ణయం మేరకే జరిగిందని ఈటెల రాజేందర్ బుకాయిస్తున్నారని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఆర్థిక మంత్రిగా ఉన్న వ్యక్తి ప్రాజెక్టు నిధులతో తనకు సంబంధమే లేదని అనడం హాస్యాస్పదమని వ్యాఖ్యలు చేశారు. దేశమంతా కాళేశ్వరం ప్రాజెక్టులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని కోడై కూసిందన్నారు.కాళేశ్వరం కమిషన్ విచారణ అనంతరం బీజేపీ ఎంపీ ఈటెల చేసిన వ్యాఖ్యలపై మిగతావి 2లో

## నాలాల ఆక్రమణపై స్పెషల్ డ్రైవ్: హైడ్రా



## బనకచర్లపై బిఆర్ఎస్ తరపున
# సుప్రీంలో కేసు వేస్తాం

- అబద్దాలతో కాలం గడుపుతున్న సిఎం, మంత్రులు
- ఎపి గోదావరి, కృష్ణాలు దోచుకుంటున్నా కళ్లు తెరవరా
- కేంద్రంతో పోరాటం చేయకుండా బిజెపి సైలెంట్ అయ్యింది
- ఉద్యోగులకు డిఎపై కేబినేట్‌లో ఇంతగా చర్చలా
- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ హరీష్ రావు



**తొలి అక్షరం/సిద్దిపేట,జూన్ 6:** అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్ రెడ్డి అనుకున్నం, కానీ ఆయన్ని మించి తాత అయ్యిండు ఉత్తమ్ కుమార్ రెడ్డి అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఉత్తమ్ అబద్దాలు చూస్తే గోబెల్స్ అనేవాడు ఉంటే ఉరి పెట్టుకునేవాడు అని హరీశ్ రావు అన్నారు. దుబ్బాకలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు- బీజేపీ ఎంపీలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్ సమావేశం నిరాశపరిచిందని మాజీ మంత్రి హరీష్ రావువ్యాఖ్యలు చేశారు. ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. గాలి మోటార్‌పై తిరుగుతూ గాలి మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒక్క డీఏ ఇచ్చేందుకు ముచ్చటగా మూడు కమిటీలు వేశారని... దీనికి కేబినెట్‌లో అయిదు గంటల చర్చ చేశారని వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం నిట్ట నిలువునా ముంచుతోందన్నారు. తక్షణమే మూడు డీఏలు చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. ఉద్యోగస్తులపై మిగతావి 2లో

## రూ.25వేల కోట్ల అవినీతి ఆరోపణల కేసు

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ నేత ఫిర్యాదుతో కేటీఆర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని గతంలోనే కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న హైకోర్టు.. కేటీఆర్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టి వేస్తూ తీర్పు ఇచ్చింది. అయితే హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుగుణ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం విచారణ జరుగగా.. పిటిషన్‌పై సమాధానం చెప్పాలంటూ కేటీఆర్‌కు సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

## బనకచర్లతో తెలంగాణకు అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

చట్టం ప్రకారం ముందుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఏపీ ఉల్లంఘనలను పూర్తిగా లేఖల్లో వివరించాం. చట్టవిరుద్ధంగా ఏపీకి కేంద్రం సహకరిస్తుందని అనుకోవట్లేదు. తెలంగాణకు అన్యాయం జరిగితే.. ఎంత వర-కై-నా పోరాడుతాం. తెలంగాణ నీటి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తాం.. వెనక్కి తగ్గేదేలే. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్రాన్ని ఒప్పించాలి. కృష్ణాలో అన్యాయం జరుగుతుంటే పదేళ్లు భారాస సహకరించింది. ఉమ్మడి ఏపీలో కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 724 టీ-ఎంసీలు ఏపీకి వెళితే భారాస హయాంలో 1,254 టీ-ఎంసీలు తరలించారు. కాళేశ్వరానికి వృథా ఖర్చు చేయకుంటే కృష్ణా ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యేవి. తుమ్మిడిహట్టి దగ్గర కాకుండా.. మేడిగడ్డ వద్ద కట్టడం వల్ల రూ.68వేల కోట్లు- కాళేశ్వరం ప్రాజెక్టుకు అదనపు ఖర్చు అయింది. ఏపీకి 512 టీ-ఎంసీలు, తెలంగాణకు 299 టీ-ఎంసీలు చాలని సంతకం చేసింది భారాస ప్రభుత్వం కాదా? కృష్ణా నీళ్లలో అప్పుడు మోసం చేసి ఇప్పుడు భారాస నేతలు నాటకాలు ఆడుతున్నారని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు.

## నాలాల ఆక్రమణపై స్పెషల్ డ్రైవ్: హైడ్రా



**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 6:** హైదరాబాద్ నగరంలోని నాలాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఆక్రమణలను కూల్చివేత లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. నాలాలను ఆక్రమించిన వారిని వదలబోమన్నారు. వచ్చే 4 నెలల పాటు ఈ అంశంపైనే దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. వరదనీరు నిలిచే ప్రాంతాలపై ప్రత్యేక అధ్యయనం చేయనున్నట్లు- తెలిపారు. నాలా, నీటి వనరుల ఆక్రమణలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.నాలాలపై అక్రమంగా నిర్మించిన వాణిజ్య భవనాలను తొలగిస్తామని.. పేదల నిర్మాణాల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. రసూల్‌పురా నాలాపై అక్రమ నిర్మాణాలను కూల్చివేశామని రంగనాథ్ తెలిపారు.

## ఆటోను ఢీకొన్న లారీ: ఇద్దరు మృతి




**తొలి అక్షరం/సంగారెడ్డి,జూన్ 6:** జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకొచ్చిన ఓ లారీ అదుపుతప్పి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం సదాశివపేటలో ఈ ప్రమాదం చోటు-చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్ మార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో చనిపోయిన వారిని సాయికిరణ్, అభిషేక్‌గా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఇథనాల్ కంపెనీ అనుమతులు బిఆర్ఎస్ పుణ్యమే: సంపత్

**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 6:** బిఆర్ఎస్ ఎంఎల్ఏ హరీష్‌రావు శవరాజకీయాలు చేస్తున్నారని ఎఐసిసి సంపత్ కుమార్ తెలిపారు. బిఆర్ఎస్ రాజకీయ కుట్రలో భాగంగానే ధన్వాడ ఘటన జరిగిందని, రైతులపై బిఆర్ఎస్ కార్యకర్తలు దాడులు చేశారని మండిపడ్డారు. ఇథనాల్ కంపెనీకి అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వమే అనుమతి ఇచ్చిందని గుర్తు చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుమతులు ఇచ్చాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎలాంటి అనుమతి ఇవ్వలేదని సంపత్ కుమార్ తెలియజేశారు. రైతుల భూములను ప్రభుత్వం లాక్కోలేదని స్పష్టం చేశారు. ప్రజల జీవితాలతో హరీష్‌రావు రాజకీయం చేయొద్దని సూచించారు. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం రాజోలి మండల పరిధిలో పెద్ద ధన్వాడ గ్రామంలో నిర్మించతలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణంపై 12 గ్రామాల ప్రజలు దాడి చేసిన విషయం తెలిసిందే.

## బిఆర్ఎస్ కాదు.. అది డిఆర్ఎస్

(మొదటి పేజీ తరువాయి)

వాసాలమర్రి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఇళ్లన్నీ కూలగొట్టారు. ఆ తర్వాత కేసీఆర్ ఆ గ్రామాన్ని పట్టించుకోలేదు. పదేళ్లు దోచుకొని రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చారు. రూ.8లక్షల కోట్లు- అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీశారు. విద్యార్థులు, రైతులు, ఉద్యమకారులను పొట్టన పెట్టుకున్నారు. పేదలను తప్పుదోవ పట్టించి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. రూ.20లక్షల కోట్లు ఉంటే రూ.2వేల కోట్లతో ఎస్-ఎల్‌బీసీ పూర్తి చేయలేదు అంటూ నిప్పులు చెరిగారు. యాదాద్రిని తిరిగి యాదగిరిగుట్టగా మార్చాం. కొండపై భక్తులు నిద్రించేలా.. ఆటోలు నడిచేలా చేస్తాం. 60 కిలోల బంగారంతో ఆలయ గోపురం నిర్మాణం చేపట్టాలని నిర్ణయించాం. టీటీడీ బోర్డు మాదిరిగా తెలంగాణలోనూ వైటీడీ ఏర్పాటు చేశాం. యాదగిరిగుట్టలోని విద్యాసంస్థలను వర్సిటీ స్థాయికి అభివృద్ధి చేస్తాం. ఎవరు అడ్డంపడినా సరే.. మూసీ ప్రక్షాళన చేసి నల్గొండ రైతులను ఆదుకుంటాం. గోదావరి జలాలతో మూసీ నదిని నింపుతాం. సబర్మతి, గంగా నదులు ప్రక్షాళన చేసుకోవచ్చు.. మూసీ నదిని మాత్రం ప్రక్షాళన చేయకూడదా అని ప్రశ్నించారు. సభలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, దామోదర రాజనర్సింహ, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## కాళేశ్వరం రిపోర్ట్ త్వరగా బయట పెట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

పెట్టారని తెలిపారు. నిజాయితీగా ఉండాలని కోరే పార్టీ బీజేపీ అని ఎంపీ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు సృష్టికర్త కేసీఆర్ అని ఆయనే చెప్పుకున్నారని.. ప్రాజెక్టు కట్టాలనే ఆలోచన ఆనాటి ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. కాళేశ్వరంపై నిర్ణయం తీసుకుంది కేసీఆర్ అని.. అప్పుడు ఆయనే బాస్ అన్నారు. 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ పార్టీలో ఉన్నా విలువలతో ఉన్నట్లు తెలిపారు. తెలంగాణలో మొట్టమొదటి ఆర్థిక మంత్రిగా పనిచేశానన్నారు. తెలంగాణ సాధించుకుంది నీళ్లు, నిధులు, ఉద్యోగాల కోసమని చెప్పారు. 2006లో తుమ్మిడిహట్టి రూ.16 వేలు ఉంటే 2015లో రూ.38 వేల కోట్లకు పెరిగిందన్నారు. తుమ్మిడిహట్టి దగ్గర కట్టాలని అనుకున్నా మహారాష్ట్ర ఒప్పుకోలేదన్నారు. మూడు బ్యారేజీలు సీడబ్ల్యూసీ రిపోర్ట్, టెక్నికల్ కమిటీ- ఆధ్వర్యంలో కట్టారన్నారు. మూడు బ్యారేజీలు సబ్ కమిటీ, టె-క్నికల్ కమిటీ రిపోర్టు ఆధారంగా కట్టారని వెల్లడించారు. మొదట రూ.63వేల కోట్ల అంచనాతో ప్రారంభం అయితే.. రైతుల డిమాండ్ మేరకు రూ.82 వేల కోట్లకు పోయిందన్నారు. కాళేశ్వరం కార్పొరేషన్ ఏ పర్పస్ కోసం పెట్టారని కమిషన్ ప్రశ్నిస్తే.. కాళేశ్వరం కార్పొరేషన్‌కు ఫైనాన్స్ శాఖకు సంబంధం లేదని చెప్పినట్లు తెలిపారు. 'మా బతుకులో నిబద్ధతతో ఉంది... నా గొంతుపై తుపాకీ పెట్టినా నిజాలే మాట్లాడతా. ఎవరు పిలిచినా ఎక్కడైనా నిజాలే చెప్తా. కొందరు బట్టకాల్చి మీదేస్తే నాకేమీ కాదు' అని అన్నారు. మూడు బ్యారేజీలు రూ.10వేల కోట్ల లోపే అని చెప్పారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌ను త్వరగా బయటపెట్టాలని.. నిజమైన దోషులు ఎవరో ప్రభుత్వం తేల్చాలని రాజేందర్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవకతవకలపై పీసీ ఘోష్ కమిషన్ విచారణ కొనసాగుతోంది. శుక్రవారం బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓపెన్ కోర్టులో ఈటెలతో అంతా నిజమే చెప్తానని కమిషన్ ప్రమాణం చేయించింది. అనంతరం కమిషన్ ప్రశ్నలు సంధించింది. కమిషన్ ముందు 113వ సాక్షిగా మాజీ మంత్రి హాజరయ్యారు. దాదాపు 40 నిమిషాల పాటు- విచారణ సాగింది. బ్యారేజీల నిర్మాణం, కాళేశ్వరం కార్పొరేషన్, డీపీఆర్‌పై మొత్తం 19 ప్రశ్నలను కమిషన్ సంధించింది. కేబినెట్ నిర్ణయం తీసుకున్న తర్వాతే మూడు బ్యారేజీల నిర్మాణం మొదలుపెట్టామని చెప్పారు. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ఒప్పుకోలేదని తెలియజేశారు. మహారాష్ట్ర ఒప్పుకోకపోవడంతో 150 నుంచి 148 కుదించామన్నారు.

## చినాబ్ వంతెన కశ్మీర్ పురోగతికి ప్రతిబింబం

(మొదటి పేజీ తరువాయి)

తగ్గేది లేదు. పాక్ కుయుక్తులను భారత్ ఎప్పటికప్పుడు ఎండగడుతూనే ఉంటుంద న్నారు.. ఉగ్ర కుట్రలకు దీటుగా బదులిస్తున్నాం. కశ్మీర్‌లో పర్యాటకాన్ని ధ్వంసం చేయా లని, దేశంలో అల్లర్లు సృష్టించాలనిపహల్గాంలో ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. అమాయక ప్రజల ప్రాణాలు పొట్టనబెట్టుకున్నారు. దానికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌తో మన శక్తి ఏంటో చూపించాం. సరిగ్గా నెల రోజుల క్రితం పొరుగు దేశంలోని ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేశాం. పాక్ నాయకత్వానికి నిద్ర లేకుండా చేశాం. ఎన్ని కుట్రలు పన్నినా కశ్మీర్ అభివృద్ధిని అడ్డుకోలేరని మోదీ పునరుద్ఘాటించారు. ఈఫిల్ టవర్ కన్నా ఎత్తైన వంతెనను నిర్మించుకున్నాం. భారత ఇంజినీరింగ్ నైపుణ్యానికి చినాబ్ బ్రిడ్జ్ ఓ ప్రతీక. ఈ వంతెన నిర్మాణంతో ఈ ప్రాంతం పర్యాటక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ బ్రిడ్జ్ నిర్మాణంలో ఎన్నో సవాళ్లు ఎదురైనా.. మాతా వైష్ణోదేవి ఆశీర్వాదంతో ఇది సాధ్యమైంది. ఈ రోజుతో భారత రైల్వే నెట్‌వర్క్‌తో కశ్మీర్ కూడా అనుసంధానమైంది. ఇక కశ్మీర్ నుంచి కన్యాకుమారి అనేది వాస్తవ రూపంలోకి వచ్చినట్లయ్యింది. ఈ రోజు కోసం అనేక తరాలు ఎదురుచూశాయి. సీఎం ఒమర్ అబ్దుల్లా కూడా 8వ తరగతి నుంచే ఈ ప్రాజెక్ట్ కోసం కలలు కన్నారు. ఇప్పుడు భాజపా ప్రభుత్వం దాన్ని నెరవేర్చిందని ప్రధాని మోదీ తెలిపారు.శతాబ్దాల కలను నెరవేరుస్తూ ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే ఆర్చ్ బ్రిడ్జి చీనాబ్ రైల్ బ్రిడ్జిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం నాడు ప్రారంభించారు. కట్‌డా నుంచి కాశ్మీర్‌కు వెళ్లే వందేభారత్ రైలుకు జెండా ఊపడం ద్వారా వంతెన అందుబాటులోకి వచ్చింది. బ్రిటిషర్ల కాలం నాటి ప్రణాళిక ఇన్నేళ్లకు కార్యరూపం దాల్చిందంటూ ప్రధాని మోదీపై కాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ప్రశంసలు కురిపించారు. బ్రిటిషర్లు చేయలేని పని మోదీ చేశారని ఈ సందర్భంగా ఏర్పాటు- చేసిన కార్యక్రమంలో ఒమర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ -ట్రైన్ సర్వీస్ కోసం ఎందరో కలలు కన్నారని, బ్రిటిషర్లు ఆ పని చేయలేకపోయినప్పటికీ ప్రధాని దానిని పూర్తి చేశారన్నారు. ఇప్పుడు కాశ్మీర్ లోయకు యావద్దేశంతో అనుసంధానం జరిగిందని అన్నారు. ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్ లింగ్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన చినాబ్ వంతెన మోడ్రన్ ఇంజనీరింగ్ అద్భుతంగా నిలిచింది. 1,315 మీటర్ల పొడవు, 359 మీటర్ల ఎత్తుతో నిర్మించిన ఈ వంతెన ప్రపంచంలో ఎత్తైన ఐఫిల్ టవర్ టవర్ కంటే 30 మీటర్లు ఎక్కువ కావడం విశేషం. 2002లో అటర్ బిహారీ వాజ్‌పేయి హయాంలో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన జరిగింది. 23 ఏళ్ల తర్వాత ప్రధానమంత్రి మోదీ దీనిని సాకారం చేశారు. చీనాబ్ బ్రిడ్జి వంతెన ప్రారంభోత్సవానికి రాజకీయ ప్రాధాన్యత ఉందని ఒమర్ అబ్దుల్లా పేర్కొంటూ, ఇందుకు గత నాయకులు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. త్వరలోనే జమ్మూకాశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా లభిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. అటల్ బిహారీ వాజ్‌పేయి పేరును ఈ సందర్భంగా గుర్తుచేసుకోకుంటే తాను తప్పుచేసిన వాడినవుతానని సీఎం అన్నారు. తాను 8వ తరగతిలో ఉన్నప్పుడు ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగిందని ఒమర్ గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు తన వయస్సు 55 ఏళ్లని, ఇప్పటికి ప్రాజెక్టు పూర్తయిందని చెప్పుకొచ్చారు. ఈ ప్రాజెక్టులు జాతీయ ప్రాధాన్యత కలిగినవిగా వాజ్‌పేయి హోదా ఇవ్వడం, అలాగే బడ్జెట్‌ను పెంచడం వల్లే నేడు ఇది సాకారమైందని అన్నారు.జమ్మూకాశ్మీర్‌లోని అనంతనాగ్ స్టేషన్ నుంచి బనిహాల్ టన్నెల్, కాత్రా స్టేషన్, ఇప్పుడు చీనాబ్ బ్రిడ్జ్.. ఇలా ప్రతి కీలక ప్రాజెక్టులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాలుపంచుకునే అవకాశం కలగడం తన అదృష్టమని ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఈ వంతెన లాగానే పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు శరవేగంగా నిర్మాణమవు తున్నాయని చెప్పారు. చీనాబ్ రైల్వే బ్రిడ్జి అంటే కేవలం స్టీలు, కాంక్రీట్‌తో నిర్మితమైనదే కాదని, తరతరాల ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపమని తెలిపారు. జమ్మూకశ్మీర్ ప్రజలకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటు-ందని చెప్పారు. వికసిత్ జమ్మూకాశ్మీర్ లక్ష్య సాధనకు చిత్తశుద్ధితో పనిచేస్తామని, జమ్మూకాశ్మీర్ ప్రజల తరఫున ప్రధానమంత్రికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని అన్నారు.

## కాళేశ్వరంపై ఈటెల డొంకతిరుగుడు

(మొదటి పేజీ తరువాయి)

మహేష్ గౌడ్ స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి సంబంధించి విచారణ అనంతరం ఈటెల వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగించా యన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబా నికి ఏటీఎంలా మారిందని... వేల కోట్ల అవినీతి జరిగిందంటూ గతంలో అనేక సార్లు ప్రధాని సహా పలువురు ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. కానీ ఈటెల అందుకు భిన్నంగా ఈరోజు కమిషన్ ఎదుట ఇచ్చిన వివరణను చూస్తే కేసీఆర్‌తో కుమ్మక్కయినట్లు- స్పష్టమైంద న్నారు. కాళేశ్వరంలో ఈటెలకు కూడా వాటాలు ముట్టినందునే కేసీఆర్‌కు అనుకూలంగా మాట్లా డారని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం అవినీ తిపై పల్లెత్తు మాట కూడా విచారణ కమిషన్ ఎదుట ఎందుకు చెప్పలేదని ఈ-టె-లను ప్రశ్నించారు. ప్రజలు, రైతుల నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకే కాళేశ్వరం ప్రాజెక్టు అంచనాలను పెంచినట్లు- ఈటెల చెప్పడం చూస్తుంటే ఆశ్చర్యమేస్తోందన్నారు. ఈ-టె-ల ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నట్లు-ందని అన్నారు. కేసీఆర్‌ను కాపాడేందుకు పూర్తిగా వకాల్తా పుచ్చుకుని వివరణ ఇచ్చినట్లు- ఎంపీ మాటల ద్వారా కన్పిస్తోందన్నారు. పక్కా ప్రీ ఎ÷-లాన్ ప్రకారం కేసీఆర్, హరీష్ రావు, ఈ-టె-ల కూడబలుక్కుని ఒక్కటే సమాధానాలు చెప్పాలని, అవినీతి జరగలేదని బుకాయించేందుకు సిద్ధమై వచ్చి పచ్చి అబద్దాలు వల్లిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ-టె-ల వ్యాఖ్యలు చూస్తుంటే హరీష్ రావుతో ఆయన రహస్యంగా భేటీ- అయ్యారని తాను చెప్పిన మాటలు నిజమని తేలిందన్నారు. టెక్నికల్ కమిటీ- ఇచ్చిన నివేదిక ఆధారంగానే ప్రాజెక్టు కట్టారని చెబుతున్నారన్నారు. కాళేశ్వరంలో వేల కోట్ల అవినీతి జరిగిందని మొత్తుకున్న బీజేపీ నాయకులు ఇప్పుడ ఏ ముఖం పెట్టు-కుని మాట్లాడతారని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌తో బీజేపీకి ఉన్న లోపాయికారి ఒప్పందం మేరకే కేసీఆర్‌ను కాపాడేందుకు ఈటెలతో వివరణ ఇప్పించారా అని నిలదీశారు. దీనిపై బీజేపీ నాయకత్వం సమాధానం చెప్పాలన్నారు. లేదంటే ప్రధాని సహా బీజేపీ పెద్దలకు కూడా వాటాలు ముట్టినట్లే అని.. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రజలంతా భావించాల్సి వస్తుందన్నారు. 'కాళేశ్వరం విషయంలో బీజేపీ తన పంథా మార్చుకుందా? ఈ-టె-ల ఇచ్చిన వివరణ ఆయన సొంతమా? లేక బీజేపీ విధానమా? కాళేశ్వరంలో అవినీతి జరిగిందని బీజేపీ చెబుతుంటే... అసలు అవినీతే జరగలేదని మాట్లాడుతున్న ఈ-టె-లపై చర్యలు తీసుకునే దమ్ముందా? కాళేశ్వరంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించేందుకు సిద్ధమా?' అంటూ మహేష్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు.

## 12న పాఠశాలల ప్రారంభం

### • ఆ లోపే పుస్తకాల పంపిణీ

**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 6:** కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈనెల 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ లోపే అన్ని పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు 1.40 కోట్ల పుస్తకాలు అవసరం కాగా, ఇప్పటివరకు 1.34 కోట్ల పుస్తకాలు పాఠశాలలకు చేరినట్లు- అధికారులు తెలిపారు. మిగిలిన పుస్తకాలు కూడా త్వరలోనే పాఠశాలలకు చేరేలా చర్యలు తీసుకున్నట్లు- పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాల సాధ్యమైనంత వేగంగా వాటిని పాఠశాలలకు తరలించాలని కార్యాచరణ రూపొందించారు. పాఠశాల విద్యాశాఖ అధికారులు, మండల విద్యాధికారులు కొత్త పాఠ్యపుస్తకాలను తీసుకెళ్తున్నారు. పుస్తకాలు పాఠశాలలకు చేరిన తర్వాత స్కూల్లో తరగతుల వారీగా వేర్వేరు గదుల్లో ఉంచుతున్నారు. వర్షాల నేపథ్యంలో పుస్తకాలు తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటు-న్నారు.

## బనకచర్లపై బిఆర్ఎస్ తరపున సుప్రీంలో కేసు వేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సర్కార్ కేసులు పెడుతోందన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి గ్రామాల్లో పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అబద్ధాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మించిపోయారని వ్యాఖ్యలు చేశారు. ఉత్తమ్ కుమార్ ఏది మాట్లాడినా అబద్ధమే అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో క్రాప్ హాలిడే ప్రకటించిందన్నారు. 65 టీఎంసీల నీటిని ఉపయోగించకుండా చేసింది ఉత్తమ్ అంటూ ఆరోపించారు. నీతి ఆయోగ్ మీటింగ్‌లో ప్రధానిని రేవంత్ రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. గోదావరి బనకచర్ల కోసం బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టు వెళ్తుందన్నారు. గోదావరి బనకచర్ల మీద బీజేపీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. శ్రీశైలం రైడింగ్ ప్రాజెక్టు పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టును ఉత్తమ్ కుమార్ రెడ్డి అడ్డుకోవాలన్నారు. కాళేశ్వరం కుప్ప కూలిందని చెప్పే రేవంత్ రెడ్డి గంధమళ్ళకు నీళ్లు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించారు. కాళేశ్వరం కూలిందని కాంగ్రెస్ ప్రభుత్వం గ్లోబల్ ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను స్టే తెచ్చి ఆపిందే బిఆర్ఎస్, కేసీఆర్ అని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి విజయవాడకు పోయి చంద్రబాబును కలిసి బజ్జీలు తిని వచ్చిండు. అప్పటి నుంచి ఏం మాట్లాడటం లేదు. కృష్ణా నది జలాల్లో రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు వాడనంత తక్కువ నీళ్లు వాడింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఆంధ్రాకు దాసోహం చేసి, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్ నగర్‌లో పంటలను ఎండబెట్టింది కాంగ్రెస్. తాత్కాలిక కేటాయింపుల ప్రకారం, 65 టీ-ఎంసీలు తక్కువ వాడిన చేతగాని దద్దమ్మ ప్రభుత్వం. ఆరున్నర లక్ష ఎకరాలకు నీళ్లు ఇవ్వకపోవడమే, పంట ఎండబెట్టడమే. దీనికి సమాధానం చెప్పు, చెంపేలేసుకొని ముక్కు భూమికి రాయి ఉత్తమ్ కుమార్ రెడ్డి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కేబినెట్‌లో బనకచర్ల గురించి మాట్లాడేందుకు సమయం లేదా? ఇంతకంటే ముఖ్యమైన అంశం ఇంకోటి ఉంటదా? ఐదు గంటలు కమిషన్లు, పర్సెంటీజీలు, హైకమాండ్‌కు పంపే మూటల గురించి మాట్లాడారా? 400 టీఎంసీల గోదావరి జలాలను అక్రమంగా ఏపీ తరలిస్తుంటే గుడ్లు అప్పగించుకొని చూస్తారా? సుప్రీం కోర్టుకు వెళ్లరా, కేంద్ర మంత్రిని కలవరా, నీతి అయోగ్‌లో సీఎం ఎందుకు మాట్లాడలేదు. ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. అపెక్స్ కమిటీ అనుమతి లేకుండా, అంతర్ రాష్ట్ర అనుమతి లేకుండా, గోదావరి ట్రిబ్యునల్ అనుమతి లేకుండా ప్రాజెక్టు కడుతుంటే ఎందుకు మౌనం. చంద్రబాబును ఎదురించే దమ్ము సత్తా లేదా, ఎందుకు లాగులు తడుస్తున్నాయి. ఎందుకు సుప్రీం కోర్టుకు వెళ్లరు, ఎందుకు ప్రధానిని ప్రశ్నించరు. గోదావరి బనకచర్ల మీద బిజేపీ నాయకులు, కేంద్ర మంత్రులు ఎందుకు మాట్లాడటం లేదు. రాష్ట్ర ప్రయోజనాలు బిజెపికి పట్టవా? బనకచర్ల ద్వారా తెలంగాణ గోదావరిలో వాటా కోల్పోయే పరిస్థితి? శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ లైనింగ్ పూర్తి అయితే రోజుకు 90వేల క్యూసెక్కుల చొప్పున తరలిస్తారు. బిజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కండ్లు తెరవండి. ఏపీ నీటి దోపిడిని అడ్డుకోవాల్సిన కేఆర్ఎంబీ చంద్రబాబు అడుగులకు మడుగులు ఒత్తుతున్నది. శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ లైనింగ్ అక్రమ పనులు ఆపడం లేదు? గోదావరి బనకచర్ల అక్రమ ప్రాజెక్టును ఆపడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. గంధమల్ల ప్రాజెక్టు అంటే కాళేశ్వరంలో అంతర్భాగం.కాళేశ్వరం కూలితే గంధమల్లకు గోదావరి జిలాలు ఎట్ల వస్తాయి. నువ్వు ఇన్ని రోజులు చేసిన ప్రచారం శుద్ధ తప్పు అని తేటతెల్లమైంది. నువ్వు చేసింది అదంతా గోబెల్స్ ప్రచారం అరని తేలిందన్నారు. మూసీలో గోదావరి నీళ్లు పోస్తా అంటవు, ఎట్ల సాధ్యమైతది రేవంత్ రెడ్డి? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# బడిబాట కరపత్రం, డోర్ స్టిక్కర్స్ ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రధానోపాధ్యాయులు వేణు మాధవ రెడ్డి







**తొలి అక్షరం/దంతాలపల్లి జూన్ 06:** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దంతాలపల్లి లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణు మాధవ రెడ్డి బడిబాట కరపత్రం,డోర్ స్టిక్కర్స్ ఆవిష్కరించి బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులు, అంగన్ వాడి కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందంతో గ్రామసభ ఏర్పాటు చేసి బడిబాట ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రధాన కూడలిలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని, ప్రభుత్వ పాఠశాలలో అనుభవం,అర్హతలు గల ఉపాధ్యాయులు ఉంటారు కాబట్టి తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలని సూచించారు. 2025 మార్చిలో నిర్వహించిన పదవ తరగతి ఫలితాలలో జిల్లాస్థాయిలో 579 మార్కులతో మొదటి ర్యాంకు , 576 మార్కులతో తృతీయ ర్యాంకు సాధించి , 16 మంది విద్యార్థులు 500 కు పైగా మార్కులు సాధించారని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రావు ,APM ఉపేందర్,AAPC చైర్ పర్సన్ లావణ్య పాఠశాల ఉపాధ్యాయ బృందం అంగన్వాడి కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో లెవెల్ -2 చదరంగం పోటీలు ముగింపు

- విజేతలకు అవార్డులు అందజేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- పోటీలకు పెద్ద ఎత్తున హాజరైన తల్లిదండ్రులు విద్యార్థులు






**తొలి అక్షరం/షాద్ నగర్, జూన్06:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో లెవెల్-2 చదరంగం క్రీడల పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ పోటీలు జ్యోతి ప్రజ్వలన తో ప్రారంభమై, విజేతలకు బహుమతుల ప్రదానం తో ముగిశాయి. ముఖ్య అతిథిగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు.చదరంగ పోటీల్లో బాలబాలికలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వయస్సు 7, 9, 11, 13, 15, 17 వర్గాలలో ప్రాతినిధ్యం వహించిన విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఎంపీటీసీ అభినవ్ ఆధ్వర్యంలో పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి మధ్యాహ్న భోజనం సౌకర్యం కల్పించారు.విజేతలైన విద్యార్థులకు మెమెంటోలు, మెడల్స్, ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే శంకర్ అందజేశారు. విద్య, వైద్యం, క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్న దృక్పథంతో ఆయన కొద్దిసేపు చదరంగం ఆడి బాలబాలికలను ప్రోత్సహించారు.క్రీడల నిర్వహణలో ప్రముఖ పాత్ర పోషించిన చదరంగ పోటీ నిర్వాహకుడు, షాద్‌నగర్ చెస్ అకాడమీ కోచ్ వానరాశి జగన్ విద్యార్థులకు ధన్యవా దాలు తెలిపారు. అంతేగాక, విజేతలతో పాటు పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రాలు అందజేశారు. జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, కొందుర్గు కాంగ్రెస్ సీనియర్ నేత కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ బాబర్ అలీ ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంకల్ల చెన్నయ్య, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. బాలబాలికల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# ప్రైవేట్ పాఠశాలలో జర్నలిస్టు పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలి

- ఫీజుల భారంపై కదిలిన జర్నలిస్టులు.. ..డీఈఓ హామీతో ఊరట.

**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జూన్ 6:** మహబూబాబాద్ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పాత్రికేయుల పిల్లలకు ఫీజులలో రాయితీ కల్పించి ఆదుకోవాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే, హెచ్-143) సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం సంఘం జిల్లా కమిటీ సభ్యులు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) డాక్టర్ ఎ రవీందర్ రెడ్డి ని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు జిల్లా కన్వీనర్ మద్దినేని గుట్టయ్య, అర్బన్ అధ్యక్షులు హనుమండ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, సమాజంలో నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ పథకాల ప్రచారానికి వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వారి పిల్లల చదువులకు అధిక ఫీజులు భారంగా మారుతున్నాయని, ఈ విషయాన్ని మానవతా దృక్పథంతో అర్థం చేసుకొని జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజులలో రాయితీ ఇచ్చేలా విద్యాశాఖ చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.జర్నలిస్టుల విజ్ఞప్తిని సావధానంగా విన్న డీఈఓ, వారి పట్ల సానుకూలంగా స్పందించారు. ఈ విషయంపై ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో త్వరలోనే చర్చించి, పాత్రికేయుల పిల్లలకు ఫీజు రాయితీల విషయంలో నిబంధనలకు అనుగుణంగా తగిన న్యాయం జరిగేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు.డీఈఓను కలిసిన టీయూడబ్ల్యూజే (హెచ్-143) కో కన్వీనర్ ఎండి గౌస్ పాషా, ఉపాధ్యక్షులు రాచూరి లక్ష్మయ్య, అమ్మటి వెంకన్న, కోశాధికారి తప్పెట్ల రాజు, సహాయ కార్యదర్శి తోకల రామచంద్రు, గుంటి శ్రీధర్, చక్రధర్, సీనియర్ జర్నలిస్టులు చందర్, రాచగొల్ల సత్యం, మాలోతు సీతారాం,ఇండ్ల మహేష్, అంబాల కుమార్,తక్కల్లపల్లి శ్రీనివాస్, మాదాసు మహేష్, మనోహర్, తేజావత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ పంచాయతీల్లో ప్రతి శుక్రవారం సానిటైజేషన్ తప్పనిసరి

- విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు: మరిపెడ ఎంపీడీవో అరుణ





**తొలి అక్షరం/మరిపెడ జూన్ 6:** మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం లో మొత్తం 48 గ్రామపంచాయతీలు ఉన్నాయి గ్రామ పంచాయతీకి గౌరవ స్పెషల్ ఆఫీసర్లకు మరియు పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలియజేయునది ఏమనగా ప్రతి గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామ పొలిమేర నుండి రోడ్డు ఇరువైపులా ప్లాస్టిక్ కవర్లు పేపర్లు మరియు చెత్తాచెదరం లేకుండా చేయాలి మరియు ప్రతి వార్డు లోనూ ప్రతి వాడలో ను ప్రతి బజారులోని ప్రతి తండాలో నూ ప్రభుత్వ పాఠశాలలోనూ అంగనవాడి కేంద్రాల లోనూ ప్రభుత్వ కార్యాలయాల్లోనూ హెల్త్ సెంటర్లలో ను హాస్టల్ లలోనూ స్పెషల్గా శానిటేషన్ గ్రామ పంచాయతీ సిబ్బంది సరిపోకపోతే గ్రామంలోని లేబర్ ని పెట్టుకొని స్పెషల్ గా శానిటేషన్ ప్రతి శుక్రవారం గ్రామములో మరియు ప్రతి రోజు చేస్తున్న శానిటేషన్ చేస్తూ ప్రతి శుక్రవారం స్పెషల్ శానిటేషన్ చేయాలి మరియు లెట్రిన్ బాత్రూమ్ ఎప్పటికీ శుభ్రంగా ఉండేటట్లు చేయించగలరు అలా చేయించుకుంటే ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో ను కొన్ని గ్రామ పంచాయతీలు మన గౌరవ ఎంపిడిఓ గారు సందర్శిస్తారు కొన్ని గ్రామ పంచాయతీలు ఎం పి ఓ అనే నేను తిరిగి శానిటేషన్ పరిశీలిస్తాము కావున శానిటేషన్ విషయంలో కాంప్రమైజ్ అయ్యే ప్రసక్తే లేదు కావున అందరికీ తెలియజేయునైనది ఎందుకంటే ప్రభుత్వం మల్టీ వర్కర్స్ లకు ప్రతినెల జీతము ఇస్తుంది కావున ప్రతి గ్రామ పంచాయతీకి ఒక కార్యదర్శి ఉన్నారు ట్రాక్టర్ ఉన్నది గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు తడి చెత్త పొడి చెత్త వేరు వేరు చేసి వర్మీ కంపోస్టు తయారు చేయండి మరియు పొడి చేతను అమ్మి చాలాను ఎస్టిలో జమ చేయాలి అని ప్రతిరోజు సమావేశం నిర్వహిస్తున్నారు కాబట్టి మీరందరూ పై విషయాన్ని ఆలోచించి ప్రతి రోజు మరియు శుక్రవారం స్పెషల్ శానిటేషన్ చేస్తూ ఉండండి మరియు ప్రతి గ్రామము నుండి స్పెషల్ శానిటేషన్ చేస్తున్నట్టు ఫోటోలు గ్రూపులో షేర్ చేయండి ఏ గ్రామం నుండి శానిటేషన్ చేస్తున్నట్టు ఫోటో రాలేదో ఆ గ్రామపంచాయతీ సిబ్బందికి జీతం నిలుపుదల చేయబడును ఇది మన గౌరవ డి ఎల్ పి ఓ తొర్రూర్ గారు మరియు మన గౌరవ జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు మరిపెడ ఎం పీ ఓ తెలియజేశారు

# కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు రాయికల్ శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించిన వానరాసి జగన్





**తొలి అక్షరం/షాద్ నగర్,జూన్ 06:** రంగారెడ్డి జిల్లా, షాద్ నగర్ పట్టణంలోని పతంజలి యోగా సెంటర్ హాల్ లో షాద్ నగర్ లెవెల్ 2 చదరంగం క్రీడా పోటీలు నిర్వహించగా క్రీడా పోటీలకు సంబంధించి కోచ్ వానరసి జగన్ కోరిక మేరకు కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రాయికల్ శ్రీనివాస్ పోటీలలో పాల్గొన్న బాల బాలికలు అందరికీ గోల్డ్ మెడల్స్,ట్రోఫీస్ స్పాన్సర్ చేశారు.తన వంతు సహాయ సహకారాలు పూర్తిగా అందించినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ పోటీల నిర్వాహకుడు వానరసి జగన్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు రాయికల్ శ్రీనివాస్ ను మెమెంటో శాలువాతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా ఈరోజు కోచ్ వానరసి జగన్ జన్మదిన సందర్భంగా ఆయనను కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాతో సత్కరించి ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ మున్సిపాలిటీలో ఉచిత వైద్య శిబిరం

- వర్షాకాలంలో వచ్చేవ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: అదనపు కలెక్టర్..






**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జూన్ 6:** వర్షాకాలంలో వచ్చేవ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం మహబూబాబాద్ మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వైద్య శిబిరానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో వచ్చే వ్యాధులు,అరికట్టాలని,మున్సిపల్ సిబ్బంది అప్రమంతంగా ఉండాలని,డ్రైనేజీ నీరు నిలవకుండా చూడాలని, మెప్మా సిబ్బందిని కోరారు.అదేవిధంగా ఈ శిబిరాన్ని ఉద్దేశించి డాక్టర్ బి రవి రాథోడ్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ,సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నీటి సంబంధిత వ్యాధుల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని, గత సంవత్సరం మాదిరిగా డెంగ్యూ జ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని క్లోరినేషన్ చేసిన నీటినే త్రాగాలని, మెప్మా సిబ్బంది అందరికీ బీపీ, షుగర్ టెస్టులు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ మౌనిక,డాక్టర్ సురేష్, కె వి రాజు హెల్త్ ఎడ్యుకేటర్, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, మున్సిపల్ డి.ఈ ఉపేందర్, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తల కార్యక్రమం

**తొలి అక్షరం/నెక్కొండ జూన్ 6:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయ శాఖ ద్వారా నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం. నెక్కొండ మండలం లోని పత్తిపాక గ్రామంలో నిర్వహించటం జరిగినది, ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ వై హరి, డాక్టర్ ఎం మధు, మధు, మండల వ్యసాయాధికారి ఏ. నాగరాజు, ఏ ఈ ఓ ఏ,రాజేష్ పాల్గోన్నారు,ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు, వివిధ పంటలలో అధిక యూరియా వాడకం వల్ల కలిగే నష్టాలు ను, అలాగే వివిధ పంటలలో సాగునీరు పంట, దశలను బట్టి వాడు విధానం తెలియచేశారు. ముఖ్యంగా వరి సాగు చేయు రైతులు వరి కి ముందుగా పచ్చిరొట్ట ఎరువులు జీలుగా, పెసర వంటి పంటలను సాగుచేసి నెలలో సేంద్రీయ కర్బనం మోతాదు పెంచాలి, వరి రైతులు ముఖ్యంగా వానకాలం నాట్లు ఆగస్టు 15 లోపు మరియు యాసంగి వరి నాట్లు జనవరి 26 లోపు వేసినట్లయితే పంటను వడగళ్ల వానలు , ఆకాలవర్షాలు నుండి కాపాడవచ్చును అని తెలియచేశారు,ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు ఎల్, తిరుమల్ , యు రాజు, బి. సురేష్, పియాకయ్య , ఎల్. రమేష్, ఎల్, యాకుబ్ పాల్గోన్నారు.

# నేడు ఎమ్మెల్యే మురళి నాయక్ పర్యటన

**- డిసిసి ఉపాధ్యక్షులు గుగ్లోత్ బాలాజీ నాయక్..**



**తొలి అక్షరం/నెల్లికుదురు/ జూన్ 6:** మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ శనివారం మండలంలో వివిధ అధికారిక పర్యటనలో పర్యటించ నున్నట్లు డిసిసి ఉపాధ్యక్షులు గుగ్లోత్ బాలాజీ నాయక్ వెల్లడించారు.నెల్లికుదురు మండలంలోని ఉదయం 9:00 గంటలకు తారసింగ్ బావితండా ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ శంకు స్థాపన,అనంతరం లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ,ఉదయం 09:30 గంటలకునెల్లికుదురు పట్టణ కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ శంకుస్థాపన కార్యక్రమంనిర్వహించడం జరుగుతుందని,అటు పిమ్మట అమూల్య గార్డెన్స్ నందులబ్ధిదారులకు సీఎం ఆర్ఎఫ్,చెక్కులను పంపిణి చేయడంజరుగుతుంద న్నారు.ఇందిరమ్మఇండ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేయగా మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమం ఉండనున్నట్లు,ఇట్టి కార్యక్రమాలను విజయవంతం చేయడానికి మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ బాధ్యులు నాయకులు జిల్లా మండల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బాలాజీ నాయక్ పిలుపు నిచ్చారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**తొలి అక్షరం/రామన్నపేట జూన్ 6:** రామన్నపేట మండలం ఎన్నారం గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ మెట్టు మహేందర్ రెడ్డి రిసెప్షన్ కార్యక్రమానికి నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించినారు. టిఆర్ఎస్ నాయకులు బొక్క మాధవరెడ్డి. బందెల యాదయ్య. దోమల సతీష్ తదితరులు పాల్గొన్నారు

# నాగార్జున స్కూల్‌ని ప్రారంభించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**తొలి అక్షరం/రామన్నపేట జూన్ 6:** రామన్నపేట మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన నాగర్జున స్కూల్ ని ప్రారంభించి శుభాకాంక్షలు తెలియజేసిన.,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఉస్మానియా ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీరాంనాగార్జున స్కూల్ కరస్పాండెంట్ నాగరాజుసింగిల్ విండో చైర్మన్నంద్యాల బిక్షం రెడ్డి తదితరులు పాల్గొన్నారు







## బొడ్రాయి దుర్గమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్

**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 06:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో శుక్రవారం రోజున దుర్గమ్మ ఉత్సవాల్లో పాల్గొని, మోటాకోండుర్ మండల కేంద్రంలో బొడ్రాయి పూజకు బిఆర్ఎస్ నాయకులు వంగపల్లి శ్రీను ఆహ్వానం మేరకు వారి ఆధ్వర్యంలో పాల్గొన్న ఆలేరు మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బూడిద బిక్షమయ్య గౌడ్

## సీఎం పర్యటన సందర్భంగా అఖిలపక్షం నాయకుల ముందస్తు అరెస్టు



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 06:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలేరు నియోజకవర్గంలోని తిరుమలాపూర్ బహిరంగ సభ సందర్భంగా ఆలేరులో స్థానిక పోలీస్ శాఖ వారు అఖిలపక్ష కమిటీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం జరిగినది. ఈ అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కు లేదా అని ప్రశ్నిస్తున్నాను. ఇలాంటి అరెస్టులు సరైన పద్ధతి కాదు అలాగే కాంగ్రెస్ పార్టీ గత రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆలేరు ప్రజలకు హామీ ఇచ్చిన ప్రకారం శుక్రవారం రోజు జరిగే బహిరంగ సభలో ఎమ్మెల్యే స్పందించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిచే ఆలేరు రెవెన్యూ డివిజన్ కి సంబంధించిన అధికార ప్రకటన చేయించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేయుచున్నాము. లేని పక్షంలో మళ్లీ ఉద్యమాలను పెద్ద ఎత్తున తీవ్రతరం చేస్తాము. కన్వీనర్ పసుపునురి వీరేశం, రాచకొండ జనార్ధన్ చెక్క వెంకటేష్, జూకంటి పౌల్, కల్లె పుడవయ్యా, కెమిడి ఉప్పలయ్య, మంగ నరసింహులు, బందెల సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ మోత్కూర్ మండల కమిటీ ఎన్నిక

**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 06:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలం భారతీయ జనతా పార్టీ మండల కమిటీని జిల్లా అధ్యక్షులు చల్లా శ్రీలత రెడ్డి ఆదేశానుసారం మండల అధ్యక్షులు గుదే మధుసూదన్ యాదవ్ బిజెపి మండల కమిటీని ప్రకటించడం జరిగింది. మండల ఉపాధ్యక్షులుగా, రాదారపు మల్లేశం, లెల్లెల బాలనర్సయ్య, నార్సింగ్ మహేష్, గుంటి సతీష్, నియమితులయ్యారు. మండల ప్రధాన కార్యదర్శులుగా పైల్ల సతీష్, వేముల దశరథ, నియమితులయ్యారు. మండల కార్యదర్శులుగా బండ నరసింహ, బత్తిని సతీష్, బండారి నరేష్, సుతారపు వెంకన్న,కోశాధికారిగా కడమంచి యాదమ్మ సైదులు, మండలంలోని 10 గ్రామాలు 14 బూత్ల నుండి 35 మందిని మండల కార్యవర్గ సభ్యులుగా నియమించడం జరిగింది. నూతనంగా మండల కమిటీలో నియమితులైన వారందరికీ మండల అధ్యక్షులు గుదే మదుసుదన్ యాదవ్, జిల్లా కోశాధికారి గుజ్జ సోమనసయ్య , జిల్లా నాయకులు ఏనుగు జితేందర్ రెడ్డి, భీమీడి తిరుమలరెడ్డి,హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. నూతనంగా నియమితులైన వారందరు మోత్కూరు మండలంలో పార్టీని బూత్ స్థాయి నుండి పటిష్టం చేస్తూ భారతీయ జనతా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నానము అనీ వారు పేర్కొన్నారు.



# బడిబాట కార్యక్రమం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది

- ముఖ్య అతిథిగా హాజరైన మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (ఎల్.బి)... లెనిన్ వత్సల్ టొప్పో....
- వివేకానంద విగ్రహం వద్ద బడిబాట ర్యాలీ జెండా ఊపి ప్రారంభించారు





**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జూన్ 6:** బడి బాట ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,మరియు పలువురు అధికారులు పాల్గొన్నారు.విద్యాశాఖ నిర్వహించిన ఈ ర్యాలీ విద్యాభివృద్ధి లో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రతిబింబించింది.మదర్ థెరిస్సా సెంటర్ వద్ద విద్యార్థులు మరియు అధికారులు కలిసి మానవహారాన్ని ఏర్పాటు చేశారు.అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట సంకల్పంతో ప్రతిజ్ఞ చేయించారు.అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రతి ఒక్క విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చేరాలని, విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు అనే సందేశాన్ని ఈ బడిబాట కార్యక్రమం ఇవ్వాలి"అని తెలిపినారు. అలాగే, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు.జిల్లా విద్యాధికారి డాక్టర్ ఏ. రవీందర్ రెడ్డి, మాట్లాడుతూప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను తెలుపుతూ బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని,ప్రభుత్వ బడి అంటే అమ్మ ఒడి అని, ప్రభుత్వ బడిలో చదివే విద్యార్థులు ఒత్తిడి లేకుండా స్వేచ్ఛ వాతావరణం లో విద్యను అభ్యసించి అన్ని రంగాల్లో ముందు ఉంటారని, ప్రభుత్వ పాఠశాలలో ఉచిత మధ్యాహ్న భోజన పథకం, టెక్స్ట్ పుస్తకాలు,నోట్ బుక్స్, యూనిఫార్మ్స్ లతో పాటు నాణ్యమైన, గుణాత్మక విద్యాబోధన జరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలపై ప్రజలందరికీ అవగాహన కల్పించారు.తెలంగాణ సంస్కృతిక సారధి బృందం సభ్యులు ప్రభుత్వ పాఠశాలలో కల్పించిన సౌకర్యాల గురించి వివరంగా పాటల ద్వారా పిల్లలను తల్లిదండ్రులను చైతన్యపరిచారు రాజేశ్వర్, శ్రీరాములు,మెప్మా బృందం, సర్కిల్ ఇన్స్పెక్టర్, డిస్టిక్ సైన్స్ ఆఫీసర్ అప్పారావు, కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆజాద్,ప్లానింగ్ కోఆర్డినేటర్ పూర్ణ చందర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తల్లిదండ్రులుఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని బడిబాట ర్యాలీని విజయవంతం చేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే దొంతి



**తొలి అక్షరం/నెక్కొండ, జూన్ 6:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని పిట్ట కాల్ బొడ్ తండా నూతన వదువరులను ఆశీర్వదించిన నర్సంపేట నియోజకవర్గశాసన సభ్యులు అందరి అభిమాననాయకుడు దొంతి మాధవరెడ్డి. నెక్కొండ మండలం పిట్టకాల బొడ్ తండా గ్రామపంచాయతీ వాస్తవ్యులు ధరవత్ కములమ్మ -ఈర్యా ల కుమారుడు సతీష్ -అనూష ల రిసెప్షన్ కు హాజరై నూతన వదువరులను ఆశీర్వదించిన నర్సంపేట శాసన సభ్యులు దొంతి మాధవరెడ్డి ఈ కార్యక్రమం లో టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, నర్సంపేట కోర్టు ఏ జి పి బండి శివ, ఎస్టి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు లావుడ్యా తిరుమల్, మార్కెట్ డైరెక్టర్ దుడిమెట్ల కొమురయ్య,సీనియర్ నాయకులు ఇదునూరి సాయికృష్ణ, రెడ్లవాడ మాజీ ఎంపీటీసీ రవి,రెడ్లవాడ గ్రామ పార్టీ అధ్యక్షులు రావుల రాజు, దుడిమెట్ల రాజు, పిట్టకాల బోర్డు తండా గ్రామ పార్టీ బాదావత్ సూర్య, బానోత్ వీరన్న ( చిన్న) గూగుల్ మామోజీ, ధరావత్ రాజు భూక్య మధు,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీర్ల జన్మదిన వేడుకలు



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 06:**యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే ప్రజా బాంధవుడు పేదల పెన్నిధి బీర్ల ఐలయ్య జన్మదిన వేడుకలను మోటకొండూర్ మండల కాంగ్రెసు పార్టీ అధ్యక్షులు గంగపురం మల్లేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. అనంతరం బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య జన్మదిన సందర్భంగా ఆడపడుచులకు కానుకగా గ్రామ పంచాయతీ పారిశుద్ధ కార్మికులకు,అంగన్వాడి సిబ్బందికి, ఆశా వర్కర్లకు, వివికేలకు పంపించిన చీరలను అందచేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు,ఎన్ఎస్యూఐ నాయకులు, మహిళ కాంగ్రెస్ నాయకులు, బీర్ల ఐలయ్య అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే భూభారతి: తహసిల్దార్ రమేష్ బాబు



**తొలి అక్షరం/నర్సింహులపేట, జూన్ 06:** భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం భూభారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తు ందని నర్సింహులపేట తాసిల్దార్ రమేష్ బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని కౌసల్య దేవిపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఆర్ఐ అఖిల్, కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు చల్ల మధుకర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన పాఠశాల భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి

- విద్యతోనే విద్యార్థులకు ఉన్నత భవిష్యత్
- విద్యార్థులకు, తల్లిదండ్రులు భరోసా ఇవ్వాలి: ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**తొలి అక్షరం/నెక్కొండ జూన్ 6:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో చల్లా మమత- యాకూబ్ రెడ్డి ల సెయింట్ థెరిస్సా హైస్కూల్ నూతన భవన హాస్టల్ ను ప్రారంభం చేసిన దొంతి మాధవరెడ్డి, నర్సంపేట శాసనసభ్యులు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు స్నేహభావంగా మెలిగినప్పుడే భవిష్యత్లో ముందుకు సాగుతారని, నిరంతరం విద్యార్థుల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పెంపొందించాలని, విద్యార్థులు విద్యతో పాటు,సాంస్కృతిక,కార్యక్రమాల్లో పాల్గొనాలని, విద్యార్థులకు తల్లిదండ్రులు భరోసానివ్వలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి,నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలయి శ్రీనివాస్,రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్,కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ పెండ్యాల హరిప్రసాద్,నెక్కొండ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి నీతుల సారంగపాణి,బండి శీను తదితరులు పాల్గొన్నారు.

## కలం యోధునిపై కక్ష సాధింపా? అక్షరంపై అక్రమ కేసా?

- జనంసాక్షి ఎడిటర్... రెహమాన్ పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి
- మహబూబాబాద్ జిల్లా టి యు డబ్ల్యూ జె హెచ్ 143: జిల్లా కన్వీనర్ గుట్టయ్య.



**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జూన్ 6:** ఇథనాల్ ఫ్యాక్టరీ కాలుష్యానికి వ్యతిరేకంగా సాగుతున్న అన్నదాతల ఆందోళనకు అండగా నిలుస్తూ, ఆ సెగను అక్షరబద్ధం చేస్తున్న జర్నలిస్టు గొంతు నొక్కాలని రాజోలు పోలీసులు ప్రయత్నిస్తున్నారని మహబూబాబాద్ జిల్లా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టి యు డబ్ల్యూ జె హెచ్ 143 ) తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా టి యు డబ్ల్యూ జె హెచ్ 143 జిల్లా కన్వీనర్ గుట్టయ్య మాట్లాడుతూ, "అసలు ఘటనా స్థలంలోనే లేని 'జనంసాక్షి' ఎడిటర్ రెహమాన్ నూ ఈ కేసులో ఎ 2 నిందితునిగా చేర్చడం ఏంటని, ఇది కేవలం రెహమాన్పై పెట్టిన కేసు కాదు, ప్రజాపక్షం వహించే ప్రతి జర్నలిస్టుపై, పత్రికా స్వేచ్ఛపై జరిగిన దాడిగా మేము తీవ్రంగా పరిగణిస్తున్నాము" అని పేర్కొన్నారు. రైతుల ఉద్యమాన్ని నీరుగార్చడానికి, జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయడానికి చేపట్టిన ఈ చర్యలు "గోటితో పోయేదానికి గొడ్డలి దాకా తెచ్చినట్లు" ఉన్నాయని ఆయన ధ్వజమెత్తారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, రెహమాన్పై బనాయించిన ఈ అక్రమ కేసును బేషరతుగా, తక్షణమే ఉపసంహరించుకోవాలని గుట్టయ్య డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకుని, ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన పత్రికారంగానికి రక్షణ కల్పించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నామని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే హెచ్ 143 సంఘం సీనియర్ పాత్రికేయులు గౌస్ పాషా, రాచగోళ్ళ సత్యం, మహబూబాబాద్ టౌన్ అధ్యక్షుడు హనుమఒడ్ల రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు లక్ష్మణ్, అమ్మటి వెంకన్న, కోశాధికారి తోకల రామ చంద్రు, తప్పెట్ల రాజు, గుంటి శ్రీధర్,చక్రదర్, అంబాల కుమార్, తక్కెలపల్లి శ్రీనివాస్, మాదాసు మహేష్, మాలోత్ సీతారాం నాయక్, ఇండ్ల మహేష్, సోషల్ మీడియా ఇన్చార్జ్ తేజావత్ శ్రీను, గిరిజన పాత్రికేయుల నాయకులు లావుడియా మనోహర్ చౌహన్, బానోత్ చందు తదితర పాత్రికేయులు పాల్గొన్నారు.

## ఆయుష్ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో 11 ఇంటర్నేషనల్ యోగ దినోత్సవం

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యోగ క్యాలెండర్ ఆవిష్కరణ
- యోగ క్యాలెండర్ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**తొలి అక్షరం/షాద్ నగర్,జూన్ 06:** రంగారెడ్డి జిల్లా,షాద్ నగర్ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయుష్ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో 11 ఇంటర్నేషనల్ యోగ దినోత్సవం పోస్టర్ ఆవిష్కరించిన షాద్ నగర్ ఎమ్మెల్యే శ్రీ వీర్ల పల్లి శంకర్, ఈ సందర్భంగా షాద్నగర్ షాద్నగర్ శాసనసభ్యులు శ్రీ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ యోగా అనేది ప్రతి ఒక్కరికి అవసరము , వారి వారి యొక్క ఆరోగ్యాలను కాపాడుకోవాలి అంటే ప్రతి ఒక్కరు కూడా తప్పకుండా ప్రతిరోజు ఆరోగ్యం కోసము ఒక్క గంట సేపు ఎక్సర్సైజులు మరియు యోగా తప్పకుండా చేసుకోవాలని మరియు ఈనెల జూన్ 21 జాతీయ యోగ డే 10 సంవత్సరములు దాటి, 11వ సంవత్సరం యొక్క యోగా డే దినోత్సవ సందర్భంగా ప్రతి ఒక్కరూ కూడా జూన్ 21 యోగా డే రోజు పాల్గొని యోగా చేయాలని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు చెంది తిరుపతి రెడ్డి, ఖదీర్, నర్సింలు, డాక్టర్ జి. శీలా మేడం , డాక్టర్ జయ ప్రకాష్ , హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, ఫార్మసిస్ట్లు బాబు చిన్మయ రంగా, వరలక్ష్మి, ఈశ్వరి, యోగ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రాథమిక పాఠశాలలో మహిళా సంఘాలతో గ్రామసభ




**తొలి అక్షరం/నెక్కొండ జూన్ 6:** వరంగల్ జిల్లానుకున్న మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మహిళా సంఘాలతో గ్రామసభ నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి మండల విద్యాధికారి రత్నమాల, మాట్లాడుతూ ప్రభుత్వ బడులలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా మరియు ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవడం ప్రతి మహిళా సంఘం సభ్యులు తమ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. ఆ తదుపరి కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు రంగారావు మాట్లాడుతూ ప్రవేట్ పాఠశాలలో కంటే ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని, ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేస్తారని ఆయన తెలిపారు. ఆ తర్వాత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి, జాన్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్య పుస్తకములు, ఉచిత భోజనం, రెండు జతల యూనిఫాంలు, ప్రవేట్ పాఠశాల కంటే మెరుగైన విద్య ప్రభుత్వ పాఠశాలలోనే లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు లావణ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వినోద, వివిధ మహిళా సంఘాల సభ్యులు మరియు పెద్దలు మరియు ఉపాధ్యాయులు బిక్షపతి, భారతి, మాలతి, కుమార్ రెడ్డి , బద్రు మరియు రాజేందర్ పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజాగోపాల్ రెడ్డి



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 06:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండల కేంద్రంలోని యాదగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజాగోపాల్ రెడ్డి శుక్రవారం రోజున ఏకాదశి సందర్భంగా మునుగోడు నియోజక వర్గ ముఖ్య నాయకులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ సంప్రదాయ ప్రకారం స్వాగతం పలికిన అర్చకులు, వేదం ఆశీర్వచనం చేసిన వేద పండితులు. ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డికి స్వామి వారి లడ్డు ప్రసాదం అందజేసిన ప్రోటోకాల్ సూపరెండేంట్ రాజన్ బాబు. అనంతరం రాజాగోపాల్ రెడ్డి సీఎం సభకు బయలుదేరి వెళ్లారు.

# పల్లెర్లలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య జన్మదిన వేడుకలు



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 06:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెర్ల గ్రామంలో ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ కేకు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో గ్రామపంచాయతీ సిబ్బందికి చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కోడిత్యాల నరేంద్ర గుప్తా, పల్లెర్ల గ్రామపంచాయతీ సెక్రటరీ ఈ నరేష్, మాజీ ఎంపీటీసీ సోలిపురం మల్లారెడ్డి, ఏలూరు సుదర్శన్, సామ నల్ల రెడ్డి , వస్తువుల ఎల్లయ్య, తండ గోపి, కొమ్ము ముత్తయ్య, కానుకుంట్ల శ్రీను, ఆశ వర్కర్లు చంద్రకళ, కవిత, మేడి అలివేల, కొమ్ము ఉమా, వంగపల్లి సునీత, లోడీ అనసూర్య, నోముల స్వామి, మేడి యాదయ్య, కానుకుంట్ల వెంకటేష్, కానుకుంట్ల రామనర్సయ్య, వస్తువుల పాపయ్య, మేడి రామ లక్ష్మయ్య, లోడి మల్లేష్, లోడీ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి పెద్ద పండుగ ఇందిరమ్మ ఇండ్లు

- కాంగ్రెస్‌తోనే పేదలకు సొంతింటి కల సాకారం: ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి




**తొలి అక్షరం/నర్సంపేట జూన్ 6:** వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గ పట్టణ పరిధిలోని పేద కుటుంబానికి పెద్ద పండుగ ఇందిరమ్మ ఇండ్లు, కాంగ్రెస్ తోనే పేదలకు సొంతింటి కల సాకారం అవుతుందని, పేద ప్రజల జీవితాల్లో నేడు అసలైన పండుగ వాతావరనం కనిపిస్తుందని, నర్సంపేట నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ దొంతి మాధవరెడ్డి రెడ్డి అన్నారు.కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా నేడు శుక్రవారం నాడు నర్సంపేట పట్టణానికి చెందిన, 01,04,14,15,17,18,వార్డుల్లో మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇండ్లకు ముగ్గులు పోయించి కొబ్బరికాయలు కొట్టిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు లేని ఊరు ఒక్క గ్రామం కూడా లేదని, పదేళ్లలో పరిపాలించిన బిఆర్ యస్ పాలకులు ఒక్క ఇల్లు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు, పేద ప్రజల సంక్షేమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు, అర్హులకు మాత్రమే ఇళ్లు ఇచ్చేలా ప్రభుత్వ యంత్రాంగం, ప్రత్యేక దృష్టి సారించాలన్నారు, ప్రజా ప్రభుత్వంలో అర్హులకు న్యాయం చేయాలనేదే నా ఆకాంక్షాన్ని, ప్రతిపక్షాల మోసపూరిత మాటలలో పడద్దని అన్నారు, ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారుఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు(ఎం)లోని గ్రామ పంచాయతీ వద్ద బడి - బాటపై గ్రామసభ



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 06:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం శుక్రవారం రోజున ఆచార్య జయశంకర్ బడి బాటలో భాగంగా మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా మండల విద్యాధికారి, గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కె మహాదేవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో, అనుభవం, అంకిత భావం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని అన్నారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిఎంఎస్శ్రీఆర్ఐ కింద ఎంపిక అయినదని, కంప్యూటర్ ల్యాబ్,ఐఎఫ్పీ డిజిటల్ బోర్డ్స్, లాంటి ఆధునిక సదుపాయాలు కలిగి ఉందని, తెలిపారు.డిజిటల్ విద్యతో పాటు, రాగిజావ, గుడ్డుతో కూడిన మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య, నోటుపుస్తకాలు, 2జతల యూనిఫామ్ ఇస్తున్నామని తెలిపారు. ఇన్ని సదుపాయాలతో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించి ప్రభుత్వ పాఠశాలాలను రక్షించుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాందయాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పురప్రముఃఖులు, అంగన్వాడి టీచర్లు,మహిళా సంఘాలు, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్లు,తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టు



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 06:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం తుర్కపల్లి మండలం తిరుమలపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి బాట ముఖ్యమంత్రి సభ సందర్భంగా బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బీసు చందర్ గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు లగ్గాని రమేష్ గౌడ్, మొరిపిరాల మాజీ సర్పంచ్ తిర్మల్ రెడ్డి, తదితరులను అరెస్టు చేసి మేడిపల్లి పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అరాచకపాలన కొనసాగిస్తూ అక్రమ అరెస్టు, నిర్బంధాలతో పోలీస్ వ్యవస్థని అడ్డుపెట్టుకొని పరిపాలన సాగిస్తున్న రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజల ముందు ఏనాడో చిల్లర ముఖ్యమంత్రిగా ముద్ర వేసుకున్నాడు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చి ప్రజా పాలన కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలకు సిద్ధమవుతామన్నారు.ఈ కార్యక్రమంలో మేడిపల్లి ఎస్ ఐ కృష్ణయ్య, కానిస్టేబుల్ ప్రదీప్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

# ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పుట్టినరోజు వేడుకలు

- నిర్వహించిన ఆలేరు పట్టణ కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు ఎంఏ ఏజాజ్

**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 06:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో శుక్రవారం రోజున ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పుట్టినరోజు సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎంఏ ఎజాజ్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందికి సుమారు 80 మందికి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, పలకరింపులో ప్రేమతత్వం, ధైర్యం చెప్పడంలో అన్న నైజం అని, జనహితమే లక్ష్యంగా రేపటి మార్పు కోసం జనం మధ్య జనం కోసం నడుస్తున్న ఐలన్నకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ కట్టెగుమ్మల సాగర్ రెడ్డి, నాయకులు చింతలపాణి శ్రీనివాస్ రెడ్డి, ఎండి జైనువుద్దీన్, మల్లెల శ్రీకాంత్, పాము అనిత, కలకుంట్ల లోకేష్, జూకంటి సంపత్, సుంకరి విక్రమ్, కాసుల భాస్కర్, మరియు మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారంలో ఉక్కు పరిశ్రమ స్థాపనకై పోరాటం తప్పదు

- అక్రమ కేసులు ఎత్తివేయాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి
- ఉక్కు పరిశ్రమ స్థాపన పోరాట కేసులో భాగంగా నేడు కోర్టుకు హాజరైన నేతలు

**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జూన్ 6:** బయ్యారంలో ఉక్కు పరిశ్రమ సాధనకై నాడు పోరాటం చేసిన కేసులో భాగంగా నేడు సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి కాంగ్రెస్ నాయకుడు శంతన్ రామరాజు గుంజే హనుమంతు మిర్యాల మల్లికార్జున్ కోర్టుకు హాజరైనారు ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి మాట్లాడుతూ అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు మూడు దఫాలుగా అధికారంలోకి ఉన్న బిజెపి ఇంతవరకు బయ్యారంలో ఉక్కు పరిశ్రమ స్థాపన చేస్తలేదన్నారు కేంద్రంలో రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఎంపీలు ఇద్దరు కేంద్ర మంత్రులు ఏం చేస్తున్నారన్నారు తెలంగాణకు బిజెపి చేసిందేమీ లేదని అన్నారు బయ్యారం ఉక్కు పరిశ్రమ కై బిజెపి ఎంపీలు మంత్రులు మోడీ వద్దకు వెళ్లి ఉక్కు పరిశ్రమ కోసం పోరాడాలన్నారు కిషన్ రెడ్డి బండి సంజయ్ కేంద్ర మంత్రులుగా ఉండి రాష్ట్రానికి ఏం ఒరగబెడుతున్నారన్నారు ఈ పరిశ్రమ కోసం బండి సంజయ్ కిషన్ రెడ్డి రాజీనామా చేయాలన్నారు ఉక్కు పరిశ్రమ కోసం నాడు చేసిన పోరాటంలో పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలన్నారు కు పరిశ్రమ స్థాపన కోసం దశలవారీగా పోరాటాలు చేస్తామన్నారు






# సీఎం సభకు ఆత్మకూరు(ఎం) మండలం నుంచి 28 ఆర్టీసీ బస్సులు

**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 06:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలేరులోని తుర్కపల్లి మండలం తిరుమలాపూర్ గ్రామంలో శుక్రవారం రోజున బహిరంగ సభ సందర్భంగా ఆత్మకూరు(ఎం)మండలం నుండి 28 ఆర్టీసీ బస్సులలో సీఎం సభకు మహిళలను తరలించారు. మోదుగు కుంట గ్రామంలో ఈ సీఎం సభకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు విద్యుత్ స్థంభంకు తాకి విరిగిపడ్డది. ఏలాంటి ప్రమాదం జరగలేదు అని తెలిపిన గ్రామస్తులు.ఈ సభకు బయలుదేరిన మండల అధికారులు, మహిళా సంఘాల అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు,మండల పరిధిలోని ఆయాగ్రామాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బక్రీద్ పర్వదినాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తావులేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలి

- ముస్లిం సోదరులకు స్థానిక ఎస్ఐ సురేష్ సూచన



**తొలి అక్షరం/నర్సింహుల పేట జూన్ 6:** బక్రీద్ పర్వదిన ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ సురేష్. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఈ విధంగా గ్రామాల ముస్లిం కుల పెద్దలతో మాట్లాడిన ఎస్ఐ బక్రీద్ పండుగ పర్వదినాలను కులమతాలకు అతీతంగా సోదర భావంతో పరస్పరం మతాలను గౌరవించుకుంటూ శాంతియుత వాతావరణంలో పండుగ వేడుకలను జరుపుకోవాలని సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సురేష్ సూచించారు. ముస్లిం కుల పెద్దలతో మాట్లాడి పోలీస్ శాఖ తరుపున మండలం లోని ముస్లిం సోదరులు అందరికి ముందస్తుగా బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎస్ఐ సురేష్.

# బిఆర్ఎస్ పార్టీ నేతల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 06:** గత ప్రభుత్వంలో యాదాద్రి భువనగిరి జిల్లాకు మంజూరు చేసిన మెడికల్ కాలేజీని భువనగిరి పట్టణంలోనే ఏర్పాటు చేయిస్తానని మాట ఇచ్చి మాట తప్పిన భువనగిరి ఎమ్మెల్యే దానికి గాను శుక్రవారం రోజు మెడికల్ కాలేజీకి ముఖ్యమంత్రి ఫౌండేషన్ స్టోన్ వేస్తున్నందున భువనగిరిలో టిఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమం చేపడుతుందని భువనగిరి ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయించడం జరిగింది. కానీ ఈ ప్రభుత్వం మెడికల్ కళాశాలను ఎట్టి పరిస్థితిలో భువనగిరి నుండి తరలిస్తే ప్రజలతో కలిసి రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేస్తున్నామని అన్నారు.

# మహాలక్ష్మి భూదేవి అమ్మవార్ల బొడ్రాయి పండుగలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 06:** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు గ్రామంలో జరుగుతున్న మహాలక్ష్మి, భూదేవి అమ్మవార్ల బొడ్రాయి పండుగ వేడుకలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు తాజామాజీ శాసనసభ్యురాలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి.వీరివెంటా బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.





## పోగొట్టుకున్న ఫోన్‌లు అందజేత

**తొలి అక్షరం/నర్సింహులపేట, జూన్ 06:** ఇటీవల కాలంలో పోగొట్టుకున్న విలువైన ఫోన్లను బాధితులకు అందజేసినట్లు స్థానిక ఎస్సై సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫోన్లను పోగొట్టుకొని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వగా వారు సీఈ ఐ ఆర్ అనే వెబ్సైట్ ద్వారా ఫోన్లను వెతికి బాధిత వ్యక్తులకు అందజేయడం జరిగింది. సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్లను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన ఎస్సై మాలోత్ సురేష్ పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## నూతన ధ్వజస్తంభం పున: ప్రతిష్టాపనలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**తొలి అక్షరం/రామన్నపేట జూన్ 6:** రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలో నిర్వహించిన శ్రీ అండాళ్ అమ్మవారు అళ్వార్ల నూతన ధ్వజ స్తంభం పున:ప్రతిష్టాపనలో పాల్గొన్నన కిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశంరామన్నపేట తాజా మాజీ జెడ్పిటిసి పున్న లక్ష్మీ జగన్మోహన్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి జేల్ల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు

## బీఆర్ఎస్ నాయకుడిని పరామర్శించిన పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి



**తొలి అక్షరం/నెక్కొండ జూన్ 6:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని సూరిపల్లి గ్రామ బీఆర్ఎస్ నాయకులు ధారవత్ శివరాం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా విషయం తెలుసుకుని వారిని పరామర్శించిన వరంగల్ జిల్లా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్నసుదర్శన్ రెడ్డి, వారితో పాటుగా నెక్కొండ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంగని సూరయ్య,పిఎసిఎస్ చైర్మన్ మారం రాము, సీనియర్ నాయకులు కొమ్ము రమేష్ యాదవ్,మాజీ మార్కెట్ చైర్మన్ గుంటుక సోమయ్య, మాజీ సొసైటీ చైర్మన్ లు కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి,బండా సత్యనారాయణ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ కారింగుల సురేష్ గౌడ్,నాయకులు మాతంగి రాజు, మాజీ ఉప సర్పంచ్ దొమ్మటి పురుషోత్తం,యూత్ అధ్యక్షులు కట్కూరి ఉమేష్, మంగళపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖులు



**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జూన్ 6:** మహబూబాద్ పట్టణ కేంద్రంలోని పీఎస్ఆర్ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొండ హనుమంత్ -కవిత దంపతుల కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వశించిన మా అసోసియేషన్ అధ్యక్షులు బొడ్డుపల్లి ఉపేంద్రం, కామ సంజీవరావు, బందారు వెంకటరమణ,నల్లు సుధాకర్ రెడ్డి, దేశబోయిన శ్రీనివాస్,బొడ్డుపల్లి శ్రీనివాస్, సురేష్ నాయక్, మధుసూదన్ రావు, నేరుటి కొమురయ్య పాల్గొన్నారు.

## సింగారంలో సీఎం పుట్టినరోజు వేడుకలు



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 06:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం సింగారం గ్రామంలో ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత , ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు . అనంతరం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో గ్రామ పంచాయతీ సిబ్బందికి చీరలను పంపిణీ చేశారు . మాజీ సర్పంచ్ జామ యాదయ్య , కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు దాసరి చంద్రమౌళి , గ్రామశాఖ ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేష్ , యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు , మాజీ వార్డు సభ్యులు అంబటి రవి కిరణ్ , ఇందిరమ్మ కమిటీ సభ్యులు దేవరపల్లి ప్రభాకర్ రెడ్డి , పంజాల కనకయ్య , పంజాల భద్రాద్రి , దాసరి నాగరాజు , వల్లాల అనిల్ , సిద్దులు , గ్రామశాఖ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చెంగోజు రా మాచారి , వి బి కే పంజాల వనిత , ఫీల్డ్ అసిస్టెంట్ పంజాల నాగమణి , ఆశా కార్యకర్త పన్నాల లక్ష్మీ , గ్రామ పంచాయతీ సిబ్బంది శ్రీను , రాజయ్య , మహిపాల్ , పద్మ , లక్ష్మీ ,తదితరులు పాల్గొన్నారు .

# తప్పిపోయిన బాలికను పోలీసులకు అప్పగింత

- శంతన్ రామరాజును అభినందించిన టౌన్ సీఐ దేవేందర్



**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జూన్ 6:** బయ్యారం మండల కేంద్రానికి చెందిన మానస అనే బాలిక శుక్రవారం మానుకోటలో తప్పిపోయింది. దారితప్పి ఏడుస్తూ రైలుపట్టాలు దాటుతున్న బాలికను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు



శంతన్ రామరాజు కాపాడారు. ఉదయం 8గంటలకు తండ్రితో పాటు మానుకోటకు వచ్చిన బాలిక కోర్టు సమీపంలో తప్పిపోయింది. దాహంతో, ఆకలితో దయనీయ స్థితిలో ఉన్న బాలికను చూసిన శంతన్ రామరాజు ఇంటికి తీసుకెళ్లి భోజనం పెట్టాడు. అనంతరం టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పెండ్యాల దేవేందర్ సమక్షంలో బాలికను వారి బంధువులకు అప్పగించారు. బాలికను కాపాడిన శంతన్ రామరాజును టౌన్ సిఐ పెండ్యాల దేవేందర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈసందర్భంగా శంతన్ రామరాజు మాట్లాడుతూ చిన్నప్పుడే తల్లిని కోల్పోయిన మేడిగ మానస అనే బాలికను కాపాడడం పట్ల సంతోషం వెలిబుచ్చాడు. ఇంట్లో ఉన్న ఆర్థిక స్థితిగతులు, తగాదాలు ఆడపిల్లలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయన్నాడు. సమాజానికి గౌరవాన్ని తెస్తున్న ఆడ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టిందన్నాడు. వయస్సుతో నిమిత్తం లేకుండా ఆడవారిపై ఎన్నో అఘాయిత్యాలు జరుగుతున్న ఈకాలంలో బాలికలను జాగ్రత్తగా సంరక్షించుకోవాల్సిన భాద్యత అందరిపై ఉందన్నాడు.ఇంకా ఈకార్యక్రమంలో బాలిక బంధువులు, గంగాధరి బాలరాజు, శిరిపురం వీరన్న, గోనె శ్యామ్ రావు, సోమారపు వీరస్వామి, ధరంసోత్ నారాయణ్ సింగ్, కమ్మగాని కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు కుటుంబాన్ని పరామర్శించిన నడికూడ యాదగిరి యాదవ్

**తొలి అక్షరం/షాద్ నగర్,జూన్ 06:** ప్రముఖ సామాజికవేత్త, మానవ హక్కు ల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, కన్స్యూమర్ ఫోరం రాష్ట్ర నాయకుడు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా మేనేజింగ్ కమిటీ మెంబర్, సీనియర్ జర్నలిస్టు డాక్టర్ కొమ్ము వెంకన్న బాబును ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రముఖ నాయకుడు, యాదవ సదర్ తాలూకా అధ్యక్షులు నడికూడ యాదగిరి యాదవ్ పరా మర్శిం చారు. షాద్నగర్ యాదవ సంఘం తాలూకా సదర్ అధ్యక్షులు నడికూడ యాదగిరి యాదవ్ మాట్లాడుతూ...డాక్టర్ మహర్షి అకాల మరణం అందరినీ విషాదంలో ముంచెత్తింది. కుటుంబం ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ధైర్యంగా ముందుకు సాగేందుకు అందరం భరోసాగా ఉండాలి. మానవ హక్కుల పరిరక్షణలో ఈ కుటుంబం చేస్తున్న పోరాటం మరింత బలపడాలని అన్నారు. ఆయనతో పాటు మాజీ గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ చీపిరి రాజు యాదవ్, ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి అడ్డాకుల శ్రీను కూడా పాల్గొన్నారు. వారు డాక్టర్ మహర్షి భార్య డాక్టర్ రజితను, తల్లి కొమ్ము సారికను పరామర్శించి, పిల్లల అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించారు.కుటుంబ సభ్యులు పునరుద్ధరణ దిశగా తీసుకోబోయే మహర్షి కూతుర్లు మహిర, హైరా భవిష్యత్ పై వారితో సంప్రదించి, వారికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సామాజిక సేవారంగంలో డా. వెంకన్న బాబు చేస్తున్న సేవల్ని కొనియాడుతూ, ఆయనకు నిత్యం మద్దతుగా ఉంటామని హామీ ఇచ్చారు.



## ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజలో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ కొడిత్యాల నరేందర్ గుప్తా



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 06:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెర్ల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులైన దుర్గం మత్యగిరి, ఉప్పరబోయిన దుర్గయ్య, సాంగపక రాజు,సంగి కృష్ణ, లోడి యాదయ్య,ఏలే సిద్దిరాములు. వారి ఇండ్ల భూమి పూజ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు కొడిత్యాల నరేందర్ గుప్తా పాల్గొన్నారు. వారితో పాటు మాజీ ఎంపీటీసీ సోలిపురం మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇందిరమ్మ కమిటీ మెంబర్స్ వస్తుపుల ఎల్లయ్య, ఏలూరు సుదర్శన్, గ్రామ పంచాయితీ సెక్రెటరీ ఇంజ నరేష్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు సామ నల్లారెడ్డి, ఉప్పరబోయిన దుర్గయ్య, మేడి శ్రీనివాస్, జి నవీన్, బ్రహ్మచారి, ఇందిరమ్మ ఇళ్ళ లబ్దిదారులు, తదిరులు పాల్గొన్నారు.

# రైళ్లకు ఆటంకం కలిగించిన పలువురుపై కేసు నమోదు

- బిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసిన ఇన్స్పెక్టర్ చటర్జీ

**తొలి అక్షరం/కాజీపేట/ జూన్ 7:** రైళ్ల రాకపోకలకు ఆటంకం కలిగించినందుకు గాను పలువురిపై ఆర్పిఎఫ్ సిబ్బంది కేసులు నమోదు చేశారు. వారిని శుక్రవారం అరెస్టు చేసి సొంత పూచికత్తుపై విడుదల చేశారు. కాజీపేట ఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ చటర్జీ తెలిపిన వివరాల ప్రకారం ఏప్రిల్ 27న హన్మకొండ జిల్లా ఎలుకతుర్తి లో జరిగిన బిఆర్ఎస్ రజతోత్సవ సభకు ఉప్పల్ రైల్వే స్టేషన్ సమీపం లోని రైల్వే గేట్ మూసివేసి ఉన్నప్పటికీ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి తనయుడు సిరికొండ ప్రశాంత్ అతని అనుచరులు రైల్వే గేట్ తెరవాలని గేటు ముందు ఆందోళనలకు దిగారు. దీంతో రైల్వే రాకపోకలకు ఆటంకం కలగడంతో ఆందోళనలకు దిగిన 14 మందిపై ఆర్పిఎఫ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. శుక్రవారం బిఆర్ఎస్ నాయకులు సిరికొండ ప్రశాంత్, తాటి జనార్ధన్, గురుకుల కిరణ్, ఎర్ల రాజు, కంచర్ల ప్రకాష్, శశికాంత్ గౌడ్, బియాని పూర్ణ లను అరెస్టు చేసి సొంత కూచికత్తుపై వదిలి పెట్టినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. మరికొందరు పరారీలో ఉన్నారని చెప్పారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన

- ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో డా భూక్యా మురళీ నాయక్





**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జూన్ 6:** కేసముద్రం మండలంలోనీ, బేరువాడ గ్రామం , బోడమచ్య తండా గ్రామపంచాయతీలో ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం బోడమంచ్య తండా ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఈ యొక్క బడి బాట కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మహబూబాబాద్ శాసనసభ్యులు డా భూక్యా మురళీ నాయక్,మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనతో పాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం జరుగుతుందని, ఉచిత పాఠ్యపుస్తకాలు, డిజిటల్ విద్యాబోధన, స్కూల్ యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం, అటల్ టింకరింగ్, ల్యాబ్ వంటి అత్యాధునికమైన సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. గ్రామాలలో ఉన్న పేద ప్రజల పిల్లలకి నాణ్యమైన విద్య ను అందించడానికి వసతి గృహాల్లో డైట్ చార్జీలు పెంచి వారికి అన్ని విధాలుగా అందుకుంటూ వారిని ఉత్తములుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం. ప్రతి ఒక్క పిల్లాడు ప్రభుత్వ పాఠశాలలో చదివించండి. కార్పొరేట్ విద్యకు ధీటుగా ప్రభుత్వ స్కూల్ లలో అందిస్తున్నాం అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మండల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

## ఆలయాల అభివృద్ధిలో తనవంతు సహాయ సహకారం ఎల్లప్పుడు ఉంటుంది

- ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి
- వీరసముద్రంలో శ్రీ పబ్బతి ఆంజనేయ, బొడ్రాయి, ధ్వజ స్థంభ ప్రతిష్టాపన మహోత్సవం
- పూజా కార్యక్రమాలలో పాల్గొన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి
- పాల్గొన స్థానిక నాయకులు

**తొలి అక్షరం/షాద్ నగర్,జూన్ 06:** దేవాలయాల నిర్మాణాలలో మరియు అభివృద్ధిలో తనవంతు సహాయ సహకారాలు ఎల్లపుడు ఉంటాయన్నారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి. జిల్లెడ్-చౌదరిగూడ మండలంలోని వీరసముద్రం గ్రామంలో శ్రీ గణపతి, శ్రీ పబ్బతి ఆంజనేయ, శివలింగం, నంది, శ్రీ సీతారాముల, బొడ్రాయి, ధ్వజ స్థంభము నవగ్రహ, ఇత్యాది దేవత ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజ కార్యక్రమాలో పాల్గొన్నారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి. ఈ కార్యక్రమంలో రావిరాల గ్రామ మాజీ సర్పంచ్ నీలమ్మ, ఉమ్మడి కొందుర్గు మండల పిఎసిఎస్ మాజీ చెర్మెన్ పి.వెంకటేశ్వర్ రెడ్డి మాజీ సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు మీదిగడ్డ బాబురావు, మాజీ సర్పంచ్ లు రాణి శ్రీశైలం, మల్లేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వజ్రలింగం, అందె మహేష్,నర్సింలు, మల్లయ్య, అందె భద్రప్ప, మల్లేష్, మల్లయ్య, భీమయ్య, ఘణపూర్ గోధుమరాసి నర్సింలు, యాదయ్య, మురళి, వెంకన్న, నవీన్ పటేల్, గోపాల్, శ్రీనివాస్, ప్రభాకర్, నర్సింహా,శంకర్, చెందు గౌడ్, భాస్కర్, అయ్య ప్రదీప్,తదితరులు పాల్గొన్నారు.



# కేంద్రం కాల్పుల విరమణ ప్రకటించి తక్షణమే మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలి

## ● ధర్నాలో వామపక్ష నేతల డిమాండ్

**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జూన్ 6:** చత్తీస్గడ్ లో బిజెపి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేర సాగిస్తున్న నరమేధాన్ని వెంటనే నిలుపుదల చేసి కాల్పుల విరమణను ప్రకటించాలని, తక్షణమే మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని వామపక్ష పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శాంతి చర్చల కమిటీ పిలుపు మేరకు మహబూబాబాద్ అంబేద్కర్ సెంటర్ లో సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ,సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈధర్నా నుద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారథి, సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్కే మదార్ లు ప్రసంగిస్తూ గత 18 నెలలుగా మధ్య భారత అడవుల్లో భారత ప్రభుత్వం "ఆపరేషన్ కగార్" పేరుతో హత్యాకాండను కొనసాగిస్తుందని, ఛత్తీస్ ఘర్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లా అబూజ్ మడ్ లో ప్రభుత్వ బలగాలు జరిపిన కాల్పుల్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతో పాటు 25కి పైగా మృతి చెంది 15 రోజులు గడవక ముందే సిపిఐ మావోయిస్టు పార్టీ మరో కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ ను కేంద్ర మిలిటరీ బలగాలు నిన్నహత్య చేశాయని వారు అన్నారు. శాంతి చర్చలకు




మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని పదే పదే కోరిందని, ఆపరేషన్ కగార్ ని ఆపివేయాలనీ, మేధావులు, ప్రజాస్వామిక వాదులు మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు, అయినా కూడా నరేంద్రమోడీ, అమిత్ షాల నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం పట్టిచ్చుకోవడం లేదని అన్నారు. పైగా నరమేధాన్ని తీవ్రతరం చేసిందని,రోజూ ఈ దేశ పౌరులను హత్యలు చేస్తూ పోతుందని,అడవి నుండి ఆదివాసీలను ఖాళీ చేయించి, అడవి సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికే ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిందని విమర్శించారు. ఒకవైపు ఆదివాసీలను మావోయిస్టు నాయకులను హత్య చేస్తున్న కేంద్ర ప్రభుత్వం మరొకవైపున చత్తీస్గడ్, మహారాష్ట్ర, జార?ండ్ లాంటి రాష్ట్రాల్లోని అటవీ సంపదను, ఖనిజాలను కార్పోరేట్ శక్తులకు కట్టబెడుతున్నదని విమర్శించారు,నంబాళ్ళ కేశవరావు ఎన్కౌంటర్ జరిగిన తెల్లారే 1000 హెక్టార్ల అటవీ భూమిని కార్పొరేట్ శక్తులకు మైనింగ్ కోసం కేటాయించారని, లక్షా 23 వేల చెట్లను కొట్టివేయడానికి వారికి అనుమతులు ఇచ్చారని విమర్శించారు. ఆపరేషన్ కగార్ ని వెంటనే నిలిపివేసి, బలగాలను వెనక్కి రప్పించాలని, ప్రభుత్వం చేస్తున్న ఈ హత్యలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జిలచే న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేస్తున్న ఈ నరమేధాన్ని ప్రజలూ, ప్రజాస్వామిక వాదులు ఖండించాలని కోరారు. ఈధర్నా లో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్ సారధి రెడ్డి సిపిఐ(ఎం ఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మండల వెంకన్న, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గునిగంటి రాజన్న, సీపీఐ జిల్లా నాయకులు పెరుగు కుమార్, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు భాస్కర్ రెడ్డి లు అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో , జిల్లా నాయకులు రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, సీపీఎం జిల్లా నాయకులు సమ్మెట రాజమౌళి, బానోత్ సీతారాం, కుమ్మరికుంట్ల నాగన్న,సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర జిల్లా నాయకులు బండారి ఐలయ్య,నందగిరి వెంకటేశ్వర్లు, జడ సత్యనారాయణ, హలావత్ లింగ్యా, గుజ్జు దేవేందర్, గుగులోత్ సక్రు,బండపల్లి వెంకటేశ్వర్లు బానోతు లింగ్య నాయక్, మాలోతు రవీందర్,ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, జలగం ప్రవీణ్, మల్లికార్జున్, గాదం శ్యాం ,ప్రసాద్ యాదవ్,బి రమేష్, కె రమేష్ పాల్గొన్నారు.

# తిరుమలాపూర్ సీఎం రేవంత్ రెడ్డి సభ





**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 06:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం తుర్కపల్లి మండలం తిరుమలాపురంలో శుక్రవారం రోజున 1500 కోట్ల రూపాయల వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి.గంధమల్ల జలాశయం– ?574.56 కోట్ల రూపాయలతో, 56 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించగల 1.410 టీఎంసీ సామర్థ్యం గల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా 50 చెరువులకు నీరు అందించబడుతుంది. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్–తుర్కపల్లి మండలంలోని ములకలపల్లిలో 20 ఎకరాల్లో ?200 కోట్ల రూపాయల వ్యయంతో పేద పిల్లలకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించేందుకు శుక్రవారం రోజు శంకుస్థాపన చేశారు.ఇంకా భువనగిరిలో మరో మోడల్ స్కూల్ మంజూరు అయ్యింది. వైద్య కళాశాల %–%ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు దాతర్‌పల్లిలో ?183 కోట్లతో వైద్య కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీంతో స్థానికంగా వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధి – టీయూఎఫ్ఐడీసీ నిధులతో ?25.50 కోట్ల విలువైన డ్రైనేజీలు, రోడ్లు,బిటి రోడ్లకు మంజూరు. రైతులకు ధాన్యం నిల్వ సదుపాయం – ఎస్డబ్ల్యూసీ ద్వారా దాతర్‌పల్లిలో 13 ఎకరాల్లో ?22.75 కోట్లతో 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు నిర్మించనున్నారు.రహదారులు, బ్రిడ్జులు – మెరుగైన రవాణా సదుపాయాల కోసం:10 రోడ్లకు ?15.13 కోట్లు (ఎంఆర్ఆర్ నిధులు) కొలనుపాక మరియు కాల్వపల్లి గ్రామాల్లో హై లెవెల్ బ్రిడ్జులకు ?13.50 కోట్లు (ఆర్%డ%బి విభాగం ద్వారా) మోటకొండూర్ మండల కేంద్ర అభివృద్ధి – తహసిల్దార్ కార్యాలయం – 2.60 కోట్లు,ఎంపీపీ కార్యాలయం – 3 కోట్లు, పోలీస్ స్టేషన్ – 2.65 కోట్లు,మొత్తం: ?8.25 కోట్లు.ఆలేరు మార్కెట్ యార్డ్ – ఏఎంసీ ద్వారా ?2.75 కోట్ల వ్యయంతో కొత్త గోదాముకు శంకుస్థాపన జరిగింది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఇదీ ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి ప్రగతి.ప్రభుత్వం మాట ఇస్తే, నిలబెట్టుకుంటుంది!అభివృద్ధే మా లక్ష్యం – ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలే మా ధ్యేయం!ప్రతి వర్గానికీ మేలు చేసే దిశగా ఈ ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు.అనంతరం సీఎం బహిరంగ సభ నుద్దేశించి మాట్లాడుతూ బిఆర్ఎస్ ని బిజెపిలో విలీనం చేయాలని ఆ పార్టీ నాయకులు కేసీఆర్ దగ్గరకు వచ్చారని కవిత మీడియా ముందు చెప్పిన విషయం తెలిసిందే. అయితే దీనిపై కేసీఆర్ క్లారిటీ ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.ప్రజాపాలన ప్రగతి బాట తిరుమలాపూర్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులతో ప్రభుత్వమును ఏర్పాటు చేసుకున్నాం. ఇందిరమ్మ రాజ్యం వస్తుంది. యాదాద్రినీ యాదగిరిగుట్టగా పేరు మార్చుకున్నాం.60 కేజీల బంగారంతో యాదగిరిగుట్ట ప్రధాన ఆలయ గోపురాన్ని ఏర్పాటు చేసుకున్నాం.టీటీడీ తరహాలో యటీడీనీ ఏర్పాటు చేసుకోబోతున్నాం. తిరుమల తిరుపతి తరహాలో యాదగిరిగుట్టలో యూనివర్సిటీనీ ఏర్పాటు చేసుకుంటాం.టీ ఆర్ ఎస్ 10సంవత్సరాల కాలంలో 2లక్షల కోట్లు ఖర్చు పెడితే ప్రాజెక్టులు ఎందుకు పూర్తి కాలేదు. పాదయాత్ర చేసి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రైతుల కష్టాలను తెలుసుకున్నా. వారి కష్టాలు తీరుస్తా. మోడీ, యోగి వాళ్ల రాష్ట్రాలలో నదులు ప్రక్షాళన చేసుకున్నట్టు మనం మన తెలంగాణలో మూసి నది ప్రక్షాళన ఎందుకు చేసుకోకూడదు. 50వేలు జేబులో లేని మందుల సామెల్ ను 50వేల మెజారిటీతో గెలిపించారు తుంగతుర్తి ప్రజలు. బిఆర్ఎస్ పార్టీ కాదు డీఆర్ఎస్ పార్టీ. అది దయ్యాల రాష్ట్ర సమితి అని సొంత బిడ్డనే అంటుంది. 10 ఏండ్లు కేసీఆర్ హయంలో ఏ నాడైన మొదటి తారీకు ప్రభుత్వ ఉద్యోగులకు జీతం పడ్డదా అని 5లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యులను ఆడుగుతున్నా? వాసాల మర్రిలో ఇండ్లు అన్ని కూల్చి స్మశానం చేసినవ్ నీ పామ్ హౌజ్ కు నేరుగా రోడ్డు కోసం. అధికారంలోకి వచ్చిన మొదటీ సంవత్సరంలోనే 60వేల ఉద్యోగాలు ఇచ్చినామా లేదా అని నిరుద్యోగ యువతనీ అడుగుతున్నా.గంధ మల్ల ప్రాజెక్ట్ ను 600కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం.ఎస్సీ, ఎస్టీ కులాల వర్గీకరణ 35సంవత్సరాలా సమస్యను పూర్తి చేసినం అని ఆయన అన్నారు.ఈ బహిరంగ సభలో పాల్గోన్న మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,ఎంపీలు, ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి,మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజాగోపాల్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి,సీనియర్ నాయకులు జనగాం ఉపేందర్ రెడ్డి, టిపిసిసి కార్యదర్శులు, మండల కాంగ్రెసు పార్టీ అధ్యక్షులు, తాజామాజీ– మాజీ ప్రజాప్రతినిధులు,కాంగ్రెసు పార్టీ వివిధ శ్రేణులు, ముఖ్యంగా మహిళా సంఘాల నేతలు, సభ్యులు భారీఎత్తున హాజరయ్యారు.

# ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్







**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) జూన్ 6:** తొర్రూర్ మున్సిపల్ కేంద్రంలోని శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని తొర్రూర్ మున్సిపల్ కమిషనర్ పి శాంతి కుమార్ ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఈరోజు మున్సిపాలిటీలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్వలిత ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. 150 మందికి పైగా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు బిపి. షుగర్. దగ్గు. జ్వరం. ఆయాసం. తలనొప్పి. ఆకలి లేకపోవడం. ఇలాంటి పరీక్ష లు నిర్వహించినట్లు తెలిపారు. శానిటేషన్ సిబ్బందికి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు. ఆర్పీలు. ఆశాలు. అంగన్వాడీ కార్యకర్తలు. మున్సిపల్ సిబ్బంది. పాల్గొన్నారు



# సర్కారు బడి పిలుస్తుందీ

## - బడి బాట కార్యక్రమం ప్రారంభించిన ప్రభుత్వ ఉపాధ్యాయులు

**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 06:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం మొర్పిరాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడి బాట కార్యక్రమంలో తెలుగు భాష ఉపాధ్యాయులు మజ్జిగ బాలరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యను అభ్యసించాలని వారి తల్లిదండ్రులను కోరారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతుందని, ఉచిత పాఠ్యపుస్తకాలు, డిజిటల్ బోధన, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం మరియు అత్యాధునికమైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాద్యాయులు, పంచాయతీ కార్యదర్శి,తల్లిదండ్రులు, అంగన్వాడీ టీచర్, మహిళ సంఘం సభ్యులు, ఆశా కార్యకర్త,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకులను విడిపించిన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 06:** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల పోలీస్ స్టేషన్ కి స్వయంగా వెళ్లి బిఆర్ఎస్ నాయకులను విడిపించిన మాజీ శాసనసభ్యురాలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి.

# పదోన్నతి శుభాకాంక్షలు తెలియజేసిన మేకల సాగర్

**తొలి అక్షరం/కోరుట్ల జూన్ 6:** మాల జాతి ముద్దుబిడ్డ గోరుమంతుల సుభాష్ హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి పొందిన శుభసందర్భంగా గోరుమంతుల శుభాష్ కు మెట్ పల్లి పట్టణ మాల సం ఘం ఉపాధ్యక్షులు మేకల సాగర్ పదో న్నతి శుభాకాంక్షలు తెలియజేస్తు భవి ష్యత్తులో మరిన్ని పదోన్నతులు పొందా లని కోరుకోవడం జరిగింది

# మాచర్ల గ్రామంలో కిశోర బాలికలకు అవగాహన సదస్సు

**తొలి అక్షరం/గట్టు/గద్వాల జూన్,6:** గద్వాల నియోజకవర్గ జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండల పరిధిలోని మాచర్ల గ్రామంలో శుక్రవారం,వి.ఏ.ఓ.ప్రకాష్ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు గ్రామంలో,14 నుంచి 18 సంవత్సరాల వయసు గల పిల్లలు కొత్త సంఘంగా ఏర్పడి సంఘానికి నామకరణం,చేసుకొని సంఘంలో బాలికలు,ఎదగాల్సిన అంశాలు వివరించారు. ఈ సందర్భంగా శారీరక వ్యాయామం,అంటే ఏమిటి,శారీరక శ్రమ యొక్క ప్రాముఖ్యత,జీవితంలో క్రీడలు మరియు ఆటల పాత్ర,సవాళ్లు అపోహలు,రోజువారీ శారీరక శ్రమ కోసం చిట్కాలు,కౌమార, దశలో ఉన్న వారి కోసం కీలక సందేశంప్రతి నెల చర్చించుకోవాల్సి అంశాలు తెలిపారు. అందరూ కిశోర బాలికల సంఘం ఏర్పడాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు మహేశ్వరి, అంగన్వాడి టీచర్లు నారాయణమ్మ, నాగవేణి,తదితరులు పాల్గొన్నారు

# ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ

**తొలి అక్షరం/జైపూర్ 06:** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం లోని ముదికుంట గ్రామ శివారు లో అటవీ అభివృద్ధి సంస్థ కు చెందిన నీలగిరి ప్లాంటేషన్ లో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ ప్లాంటేషన్ లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కందకాలు తవ్వుతున్న కూలీలకు ఈ మజ్జిగ బాక్స్ లను అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రీశ్రావణి అందజేశారు. అనంతరం ఈ ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్ కుమార్, వాచర్ శంకర్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# వైవాహిక బంధంలోకి నటుడు అఖిల్

**• 8న అన్నపూర్ణలో వివాహ విందు**




తన బ్యాచిలర్ లైఫ్‌కు గుడ్‌బై చెప్పేశారు నటుడు అఖిల్ అక్కినేని. శుక్రవారం తెల్లవారుజామున ఆయన వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. తన ప్రియురాలు జైనబ్ రవ్జీతో ఆయన వివాహం వేడుకగా జరిగింది. హైదరాబాద్‌లోని నాగార్జున నివాసంలో జరిగిన ఈ వివాహ వేడుకకు కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు, చిరంజీవి కుటుంబం, రాజమౌళి తనయుడు కార్తికేయ, దర్శకుడు ప్రశాంత్ నీల్, నటుడు శర్వానంద్‌తోపాటు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. దీనికి సంబంధించిన పలు ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. జూన్ 8న రిసెప్షన్ జరగనుంది. అన్నపూర్ణ స్టూడియోస్‌లో జరగనున్న ఈ వివాహ విందుకు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు. దిల్లీకి చెందిన జైనబ్ థియేటర్ ఆర్టిస్ట్ మాత్రమే కాదు, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ కూడా. ఇండియాలోనే కాదు దుబాయ్, లండన్‌లోనూ ఆర్టిస్ట్‌గా ఆమె రాణించారు. రెండేళ్ల క్రితం అఖిల్‌తో మొదలైన పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల అంగీకారంతో ఒక్కటయ్యారు. జైనబ్ తండ్రి జుల్ఫీ రవ్జీ, నాగార్జున కుటుంబాల మధ్య కొన్నేళ్లుగా స్నేహబంధం ఉంది. అంతకుముందు అఖిల్ ఎంగేజ్మెంట్ జరిగినా పెళ్లి దగ్గర ఆగిపోయింది.

# హరిహర వీరమల్లు మరోమారు వాయిదా

**అధికారికంగా ప్రకటించిన చిత్ర బృందం**

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తోన్న సరికొత్త చిత్రం 'హరిహర వీరమల్లు'. అనుకున్నట్‌ఉలగానే వాయిదా పడింది. ఇప్పటికే ఈ సినిమా పలుమార్లు వాయిదా పడిన విషయం తెలిసిందే. జూన్ 12న ఇది విడుదలవుతుందని భావించిన అభిమానులకు మరోసారి నిరాశ ఎదురైంది. 'హరిహర వీరమల్లు' మరోసారి వాయిదా పడినట్లు టీమ్ మరోఆరు అధికారికంగా ప్రకటించింది. అచంచలమైన ఓపిక, నమ్మకంతో 'హరిహర వీరమల్లు' సినిమాకు తోడుగా నిలిచిన అభిమానులు, శ్రేయోభిలాషులు, సినీ ప్రేమికులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. గతంలో ప్రకటించిన విధంగా జూన్ 12వ తేదీకి ఈ చిత్రాన్ని మీ ముందుకు తీసుకురావడానికి అవిశ్రాంత ప్రయత్నాలు చేస్తున్నాం. ఎంతో శ్రమించినప్పటికీ వివిధ కారణాల వల్ల ఆ రోజు సినిమాని విడుదల చేయలేకపోతున్నాం. కష్టమైనప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. పవన్ కల్యాణ్ ఇమేజ్‌ను దృష్టిలోఉంచుకుని దీనిని మరింత గొప్పగా తీర్చిదిద్దాలనేది మా ఆలోచన. ప్రతి ఫ్రేమ్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, అద్భుతమైన చిత్రంగా మలిచే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నాం. అందుకే మేము మరికొంత సమయం తీసుకుంటున్నాం. మీ ఎదురుచూపులకు బహుమతిగా గొప్ప చిత్రాన్ని అందిస్తామని హామీ ఇస్తున్నాం అని టీమ్ ప్రకటించింది. సోషల్‌మీడియా వేదికగా జరిగే ప్రచారాలను ఏమాత్రం నమ్మవద్దని కోరింది. సినిమాకు సంబంధించిన విషయాలను తామే అధికారికంగా ప్రకటిస్తామని చెప్పింది. అంతేకాకుండా త్వరలోనే ట్రైలర్ రిలీజ్ కానుందని.. కొత్త విడుదల తేదీని కూడా ప్రకటిస్తామని టీమ్ వెల్లడించింది. హిస్టారికల్ యాక్షన్ మూవీగా ఈ సినిమా సిద్ధమవుతోంది. నిధి అగర్వాల్ కథానాయిక. మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో సాగే కథ ఇది. కీరవాణి స్వరాలు అందిస్తున్నారు. రెండు భాగాల్లో దీనిని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.



# బాలీవుడ్‌లో మారుతున్న ట్రెండ్

**• హవా చాటుతున్న సౌత్ డైరెక్టర్లు**

బాలీవుడ్ ఇండస్ట్రీ తీవ్ర సంక్షోభంలో ఉంది. పెద్ద హిట్ వచ్చి చాలా రోజులు అవుతోంది. ఇక స్టార్ హీరోలు భారీ హిట్ కొట్టి ఏళ్లు గడుస్తోంది. బాలీవుడ్ నుంచి బలమైన సినిమాలు రాలేకపోతున్నాయి. ఈ క్రమంలో సౌత్ సినిమాలు బాలీవుడ్ ను దున్నేస్తున్నాయి. దీంతో బాలీవుడ్ హీరోలు సౌత్ డైరెక్టర్లతో సినిమాలు చేసేందుకు మంతనాలు జరుపుతున్నారు. ఇప్పటికే షారుక్ ఖాన్ అట్లీతో మూవీ చేసి భారీ హిట్ అందుకున్నాడు. మొన్ననే సన్నీడియోల్ కూడా తెలుగు డైరెక్టర్ గోపీచంద్ మలినేనితో మూవీ చేసి హిట్ అందుకున్నాడు. రణ్ బీర్ కపూర్ తో సందీప్ రెడ్డి వంగా మూవీ చేసి భారీ హిట్ ఇచ్చాడు. ఇలా సౌత్ డైరెక్టర్లు మంచి హిట్స్ ఇస్తుండటంతో బాలీవుడ్ హీరోలు సౌత్ వైపు చూస్తున్నారు. మంచి హిట్ డైరెక్టర్లను పట్టేసి మూవీలు చేస్తున్నారు. తాజాగా అమీర్ ఖాన్ కూడా లోకేష్ కనగరాజ్ తో మూవీ చేస్తున్నట్టు- ప్రకటించాడు. సల్మాన్ ఖాన్ కూడా తెలుగు డైరెక్టర్ తో మంతనాలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. అమీర్ ఖాన్ తో వంశీ పైడిపల్లి సినిమా అంటూ మొన్నటి దాకా వార్తలు వచ్చాయి. హృతిక్ రోషన్ కూడా సౌత్ డైరెక్టర్ తో తన తర్వాత సినిమా ఉంటుందని సమాచారం అందుతోంది. ఇలా బాలీవుడ్ హీరోలు అందరూ సౌత్ డైరెక్టర్ల వైపే చూస్తున్నారు. పైగా సౌత్ డైరెక్టర్లు వారికి హిట్లు ఇస్తున్నారు. అదే వారిని సౌత్ వైపు చూసేలా చేస్తోంది.






# ప్రియదర్శితో మిత్రమండలి

టాలీవుడ్ నటుడు ప్రియదర్శి మరో కొత్త ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. గీతా ఆర్ట్స్ 2 బాధ్యతల నుంచి విరామం తీసుకున్న నిర్మాత బన్నీ వాస్, తన సొంత బ్యానర్ బన్నీ వాస్ వర్క్స్‌ని ప్రారంభించి, దానిలో మొదటి సినిమాగా ఒక కొత్త ఎంటర్‌టైనర్‌ను నిర్మించబోతున్నట్లు- ప్రకటించిన విషయం తెలిసిందే. మిత్రమండలి అంటూ ఈ సినిమాను తెరకెక్కించబోతుండగా.. బన్నీ వాసు ఈ సినిమాను సమర్పిస్తున్నారు. సప్త అశ్వ మీడియా వర్క్స్ మరియు వైరా ఎంటర్-టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రియదర్శి కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ నిహారిక క కథానాయికగా నటించబోతుంది. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. కామెడీ ఎంటర్-టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాతో ఎస్ విజయేంద్ర దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. ఆర్‌ఆర్ ధ్రువన్ సంగీతం అందించబోతున్నాడు. ఈ సినిమా బ్యాండ్ ట్రూప్ నేపథ్యంలో రాబోతున్నట్లు తెలుస్తుంది.





# రామాయణ్ కోసం కష్టపడుతున్న రణ్‌బీర్

యానిమల్ సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ తన అప్‌కమింగ్ ప్రాజెక్ట్ 'రామాయణ్' కోసం సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. దంగల్ దర్శకుడు నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కోసం రణబీర్ ఇప్పటికే చాలా కష్టపడుతున్నట్లు- తెలుస్తుంది. అయితే ఈ సినిమాలో రణ్‌బీర్ రాముడి పాత్రను పోషిస్తున్న విషయం తెలిసిందే. దీనికోసం రణ్‌బీర్ క్లీన్ షేవ్‌తో దర్శనమిచ్చాడు. సంజయ్ లీలా భన్సాలీ 'లవ్ అండ్ వార్' సినిమా కోసం మీసాలతో కనిపించిన రణ్‌బీర్ తాజాగా రామాయణ్ కోసం క్లీన్ షేవ్‌లో కనిపించడంతో ప్రస్తుతం ఇందుకు సంబంధించిన లుక్ వైరల్‌గా మారింది. ఈ సినిమాలో సౌత్ స్టార్ యష్ రావణుడుగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్నట్లు- సమాచారం. ప్రస్తుతం ముంబైలోని ఫిలింసిటీలో 'రామాయణ్' కీలక సన్నివేశాల షూటింగ్ జరుగుతున్నట్లు- తెలుస్తుంది. ఈ సినిమాను రెండు భాగాలుగా విడుదల చేయనున్నట్లు- చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. మొదటి భాగం 2026 దీపావళికి, రెండో భాగం 2027 దీపావళికి విడుదల చేయాలని మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో సన్నీ డియోల్ హనుమాన్‌గా, లారా దత్తా -కై-కేయిగా, అరుణ్ గోవిల్ దశరథుడిగా కనిపించనున్నట్లు- వార్తలు వస్తున్నాయి. అలాగే, కాజల్ అగర్వాల్ మండోదరి పాత్రలో నటించనున్నట్లు- సమాచారం.

# అమితాబ్ సినిమాలే మన హీరోలను నిలబెట్టాయ్

**ఆనాటి తెలుగు రీమేక్‌లపై ఆర్జీవీ సంచలన కామెంట్స్**

ఆర్జీవీ ఎప్పటికప్పుడు ఏదో ఒక సంచలన కామెంట్స్ చేస్తూనే ఉంటారు. అది ఎంత పెద్ద వివాదం అయినా ఆయన పెద్దగా పట్టించుకోరు. మరోసారి అలాంటి కామెంట్స్ చేశారు. తాజాగా ఆయన ఓ పాడ్ కాస్ట్ ప్రోగ్రామ్ లో పాల్గొన్నారు. ఇందులో మాట్లాడుతూ.. ఇప్పుడు బాలీవుడ్ ఇండస్ట్రీ పడిపోయింది. మన సినిమాలను వాళ్లు కాపీ కొడుతున్నారు. కానీ ఒకప్పుడు బిగ్ బీ సినిమాలే మన సౌత్‌కు స్ఫూర్తిగా ఉండేవి. అమితాబ్ బచ్చన్ సినిమాలను మన వాళ్లు కాపీ కొట్టేవారు. అప్పట్లో చిరంజీవి, రజినీకాంత్, ఎన్టీరామారావు, ఏఎన్నార్ బిగ్ బీ సినిమాలను రీమేక్ చేసేవాళ్లు. అలా చేయడం వల్లే ఇక్కడ హిట్లు కొట్టి స్టార్ హీరోలు అయ్యారు. బిగ్ బీ వల్లే మన వాళ్లు ఇక్కడ అభిమానులకు దేవుళు అయ్యారు. కానీ 1990లో అమితాబ్ కొంత బ్రేక్ తీసుకోవడం వల్ల మనవాళ్లు అదే మాస్ సినిమాలు తీస్తూ వచ్చారు. చాలా వరకు బిగ్ బీ వల్లే మన సౌత్ లో సినిమా ఇండస్ట్రీక్రి ఆదరణ పెరిగింది. కానీ ఆ విషయాన్ని ఎవరూ ఒప్పుకోరు. ఇప్పుడు బాలీవుడ్ చాలా పడిపోయింది. మన సినిమాలు అక్కడ రీమేక్ అవుతూ మంచి హిట్ కొడుతున్నాయి. పరిస్థితి ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఒక్కోసారి ఒక్కో ఇండస్ట్రీ టైమ్ నడుస్తుందని వ్యాఖ్యానించాడు. జంజీర్ మొదలు ముఖద్దర్ కా సికిందర్ వరకు అనేక సినిమాలు తెలుగులో రీమేక్ చేశారు.



# 'ఆర్‌టి76' సినిమా షురూ

మాస్ మహారాజా రవితేజ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ల మాస్టర్, దర్శకుడు కిషోర్ తిరుమలతో కలిసి 'ఆర్‌టి76' ప్రాజెక్ట్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సక్సెస్ ఫుల్ నిర్మాత సుధాక ర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. క్రేజీ కాంబినేషన్‌లో రాబోయే ఈ చిత్రం గురువారం ముహూర్తపు వే డుకతో ఘనంగా ప్రారంభమైంది. దర్శకుడు కిషోర్ తి రుమల, రవితేజ సిగ్నేచర్ స్టయిల్, కామెడీతో కూడిన పూర్తి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ ని రాశారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే ఈ కథలో రవితేజ తనదైన ఎనర్జీతో అలరించనున్నారు. అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో రవితేజ స్టైలిష్ అవతార్‌లో, డిజైనర్ సూట్ ధరించి కనిపిస్తున్నారు. ఎయిర్‌క్రాఫ్ట్ సీటులో హాయిగా కూర్చున్న అత ను, ముందు సీటుపై ఒక కాలు క్యాజువల్‌గా ఆనించి, ఒక చేతిలో వైన్ బాటిల్, మరో చేతిలో పుస్తకంతో కనిపించడం అదిరిపోయింది. ఇది ఇప్పటివరకు రవితేజ మోస్ట్ స్టైలిష్ లుక్‌ను సూచిస్తుంది.అతను పట్టుకున్న పు స్తకంలో 'సీ ఇట్ అండ్ సే ఇట్' స్పానిష్‌లో ఉంది, ఇది అతని పాత్రపై ఆసక్తిని పెంచుతోంది. బ్లాక్‌బస్టర్ ధమా కా కోసం చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌ను అందించిన తర్వాత భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి రవితేజతో మళ్ళీ వర్క్ చేస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జూన్ 16 నుండి హైదరాబాద్‌లో ప్రారంభమవుతుంది. ఈ చిత్రం 2026 సంక్రాంతికి థియేటర్లలో రిలీజ్ కానుంది.

